## Endoments – Paper – II (హిందూతత్వము – గుళ్ళ వ్యవస్థ)

- **Ramayanam** – Basic knowledge about different characters in Ramayanam – Various parts (Kandans) of Ramayanam Dynasties mentioned in Ramayanam. Basic knowledge about various places mentioned in Ramayanam.
- **Mahabharatam** – Basic knowledge about different characters in Mahabharatam – Various parts (Parvans) of mahabharatam – Dynasties mentioned in Mahabharatam B.K. about various places mentioned in M.B.
- **Bhagavatum** – Basic knowledge about different characters in Bhagavatam, various parts (Skandams) of Bhagavatam – Basic knowledge about various places mentioned in Puranams.
- **Hindu puranams** – Basic knowledge in various Hindu puranams, Basic knowledge about various places mentioned in puranams.
- **Temple Agamas** – Different Aganas in Hindu Sastras.

**i)** Vaishanavam

a) Vaikhanasam

b) Pancharathram

c) Srivaishnavam

**ii)** Saivam

a) Smartham

b) Adisaivam

c) Varasaivam

d) Jansamam

e) Kaparikam

**iii)** Saktiyam – Mother Goddesses

- **Hindufestivals** – That will be celebrated in different parts of Indian, Classical fine arts of judicial Decision
- **Vedic Culture** – Yagnas × Yagans in Vedic with vadas, Upavedas, Upanishads, Dharmas in different stages of life.
- **Different philosophies &Wits** - In Hindu religion and Gurus who protested different philosophers & wits in the History of Hindu Relision. Alwars, Nayanars, Sankaracharya (advioras) Ramanuja Charya (Visista Adviore), Madhavacharya (Dwitram), Nimbalu (Buita Advitan) Vanaha charay – Suddha Ahvitam, Bagava(Veera satram)

## 1. రామాయణము

- శ్రీరాముని యొక్క జీవిత చరిత్రయే రామాయణం, ఇది త్రేతాయుగంలో జరిగినది.
- ఈ రామాయణం భారతీయ వాఙ్మయంలో ఆదికావ్యంగా పిలువబడుతున్నది. దీన్ని సంస్కృతంలో రచించిన వాల్మీకి ఆదికవిగా పిలువబడుతున్నారు.
- సాహిత్య చరిత్ర ప్రకారం ఈ కావ్యం సుమారు క్రీ.పూ. 1500లో దేవనాగరి భాష అయిన సంస్కృత భాషలో రచింపబడినది.
- ప్రాధాన్యత – 24000 శ్లోకాలతో కూడిన రామాయణం భారతదేశం, హిందూధర్మము, భారతీయ సంస్కృతి, నడవడిక, నమ్మకాలు ఆచారాలుపై అనితరమైన ప్రభావము కలిగి ఉన్నది.
- ఈ రామాయణంలో సీతారాముల చరిత్రతో పాటు తండ్రి కొడుకులు, భార్యాభర్తలు, అన్నదమ్ములు, మిత్రులు, యజమానులు, సేవకులు, రాజు-ప్రజలు, భగవంతుడు-భక్తుడు వీరందరి మధ్యగల సంబంధ భాంధవ్యములు, ప్రవర్తనా విధానములు రామాయణంలో చెప్పబడినవి.
- పెక్కుమంది పండితులు అభిప్రాయం ప్రకారం, రామాయణంలోని పాత్రలు ఆదర్శ జీవనమునకు ప్రమాణంగా స్వీకరించవచ్చు.

- రామాయణం భారతదేశంలోనేగాక, ఇండోనేషియా, థాయ్ లాండ్, కంబోడియా, వియత్నాం, లావోస్, మలేషియాలలో కూడా ప్రచారంలో ఉంది. ఇండోనేషియాలోని బాలి దీవిలో రామాయణం నృత్యనాటకంగా ప్రసిద్ధి పొందినది.
- సంస్కృతంలో వాల్మీకి రామాయణమే గాక, వేదవ్యాసుని ఆధ్యాత్మ రామాయణం, భవభూతి ఉత్తర రామచరితం ప్రసిద్ధమేనవి. అవధి (హిందీ) భాషలో తులసీదాస్ రామాయణం, తమిళంలో కంబరామాయణం, తెలుగులో గోనబుద్దారెడ్డి ''రంగనాధ రామాయణం'' మొల్ల ''మొల్ల రామాయణం'', భాస్కర రామాయణం వంటి రామాయణ కావ్యాలు ప్రాచుర్యం పొందాయి. అయితే ప్రామాణికత విషయంలో వాల్మీకి రామాయానికే అగ్రతాంబూలం.
- రామాయణం ప్రదానంగా సీతారాముల పుణ్యచరితము, ఆంజనేయ భక్తి భరితము, వీరిని గూర్చిన ప్రార్థనలు ఎన్నోప్రచారంలోనున్నవి.

**ఉదా:** ఆపదామప హర్తారం దాతారం సర్వ సంపదమ్
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్

- రామనామము సకలపాపహారమనీ మోక్షప్రధమనీ పలువురి నమ్మిక, అలానే తన సద్గుణముల చేత అందరిని సంతోషింపజేసినవాడు శ్రీరాముడు.
- 'రామ' అనే పదం ఎంత శక్తివంతమైనది అంటే సకల పాపమును సంహరించే శక్తి కలది.
- ఈ నామము అష్టాక్షర మంత్రమైన ''ఓం నమో, నారాయణాయ''లోని 'ర' బీజాక్షరమును పంచాక్షర మంత్రమైన ''ఓం నమశ్శివాయ'' నుండి 'మ' బీజాక్షరాల నుండి రూపొందించబడింది.
- ఆధ్యాత్మిక పండితుల అభిప్రాయం ప్రకారం మూడుమార్లు రామనామ స్తోత్రము చేసిన విష్ణు సహస్రనామ స్తోత్రము చేసిన ఫలం లభించునని

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే |
సహస్రనామ తత్తుల్యం రామ నామ వరాననే ||

❖ **వాల్మీకిరామకథకు కారణం :**

- మహర్షి వాల్మీకి ఆదికవియేగాక వేదాంత, దార్శనికుడు, తపస్వి, సంస్కర్త .
- ఒకనాడు నాదరమహర్షి వాల్మీకి ఆశ్రమముకు వస్తాడు. వాల్మీకి అప్పుడు నారధున్ని ఒక ప్రశ్న అడుగుతాడు. అది ఈ కాలంలో ఈ లోకంలో గుణవంతుడు ధర్మవంతుడు, చేసిన మేలు మరువనివాడు, ఎల్లప్పుడూ సత్యమునే పలికేవాడు, అనుకున్న పనిని

దృఢసంకల్పముతో చేసేవాడు ఎవడైనా ఉన్నాడా, ఉంటే వానిగురించి చెప్పు అని అడుగుతాడు.

- అంతేకాక అన్ని భూతములయందు దయకలవాడు, విద్వాంసుడు సమర్థుడు, ప్రియదర్శనుడు, కోపాన్ని జయించినవాడు, అసూయలేని వాడు అలా 16 గుణములు చెప్పి అవన్నీ ఉన్నవాడు, ఈ భూమిమీద ఎవడైనా ఉన్నాడా అని వాల్మీకి మహర్షి నారదున్ని అడుగుతాడు.
- అప్పుడు నారదుడు ఇలా అన్నాడు. మహర్షి మీరడిగిన గుణములు గొప్పచక్రవర్తులకే దుర్లభం. ఇక మామూలు మనుషుల సంగతి యేల. అయితే ఇక్ష్వాక వంశంలో పుట్టిన ''రాముడు'' అనే పేరుతో ఒక మహానుభావుడు ఉన్నాడు. ఆయన అపారమైన శక్తి, సంకల్ప శక్తి కలవాడు.
- ఇంద్రియములను జయించినవాడు, అన్ని విద్యలు తెలిసినవాడు. ఐశ్వర్యవంతుడు, శత్రువును నిగ్రహించగలిగేవాడు. ఈ ప్రపంచాన్నంతటిని పోషించే శక్తికలవాడు సముద్రమంత గాంభీర్యం, హిమవత్ పర్వతమంత ధైర్యం ఉన్నవాడు. సాక్షాత్ శ్రీమహావిష్ణువు అని సంక్షిప్త రామాయణాన్ని నారధుడు చెప్పనారంభించెను. సుమారు 100 శ్లోకములతో సంక్షిప్త రామాయణాన్ని నారదుడు వాల్మీకి మహర్షి చెప్పెను. అప్పుడు వాల్మీకి అమితానందభరితుడయ్యెను.
- ఆ మరునాడు తన శిష్యుడైన భరధ్వాజునితో తమసానదీ తీరమునకు వెళ్ళుచుండగా ఒక వేటగాడు క్రౌంచపక్షుల జంటలో మగపక్షిని బాణముతో కొట్టెను. అప్పుడది విలవిల లాడుతూ ఆయువులు వీడెను. ఆదృశ్యము జూచి వాల్మీకి మునిహృదయం ద్రవించెను. అప్పుడు వాల్మీకి ఇలా అనెను.

  ''ఓ కిరాతకుడా! క్రౌంచ దంపతులలో కామమోహితమగు ఒకదానిని చంపి, నీవు శాశ్వతముగా అపకీర్తిని పొందితివి''

  శోకపరితప్త హృదయముతో ఆయన ఉచ్చరించిన ఈ మాటలు చందోబద్దముగా నున్న మొదటి శ్లోకమని, అది రామాయణం వినటంవల్ల తటస్థించెనని అవగతమైంది. అందువల్ల బ్రహ్మదేవుడు వాల్మీకికి శ్లోక విశిష్టతను తెలిపి ''శ్రీరామచరిత్ర''ను కావ్యరూపమున రచింపుము అని ప్రేరేపించెను. లోకముల యందు నదులు, పర్వతములు ఉన్నంత కాలము ఆ రామాయణ కావ్యము ప్రకాశించునని దీవించెను.

**కాండము (కావ్యవిభాగములు)**

- రామాయణ మహాకావ్యము, ఏడుకాండములు (భాగములుగా) విభజింపబడింది. వాస్తవానికి వాల్మీకి రాసిన రామాయణంలోనివి. ఆరుకాండాలు మొత్తం 24000 శ్లోకములు.
- ఏడవకాండము అయన ఉత్తర కాండము వాల్మీకి రచన కాదని అంటారు. కాండము అనగా చెరుకుగడ కణుపు అని అర్థము రామాయణ కథనము చెరుకువలె మధురమైనది. కనుక ఈ పేరు సమంజసమని పండితులు వివరిస్తారు. ఒక్కొక్కకాండంలోని ఉప భాగములను 'సర్గలు''అని అంటారు.

⌘ **బాలకాండము (77)**

- ఇందులో మొత్తం 77 సర్గలున్నాయి. ఇందులోని ప్రధానాంశాలు కథా ప్రారంభం, రాముని జననం, బాల్యము, విశ్వామిత్రునితో ప్రయాణం, యాగపరిరక్షణ, సీతాస్వయంవరం, సీతారామకల్యాణం)
- **రామునిజననం** – ఘనమైన ఇక్ష్వాకు వంశానికి చెందిన దశరథుడు వేదవేత్త, పరాక్రమ దర్శ పరాయణుడు, సుసంపన్నమైన కోసల దేశాన్ని అతడు అయోధ్యరాజధానిగా చేసుకుని జనరంజకంగా పరిపాలిస్తున్నాడు.
- కాని అతనికి సంతానం లేనందున ఆ మహాజు చింతాక్రాంతుడైనాడు, మంత్రులు, గురువులు దీవేనలతో యాగం చేయతలపెట్టాడు. అందుకు తన సోదర సమానుడైన అంగరాజు రోమపాదుని కూతురు శాంతి, అల్లుడు ఋష్యశృంగుడు ఋత్వక్క్ గా అశ్వమేధయాగం జరిగింది. తరువాత ఋష్యశృంగుడే పుత్రకామేష్టియాగం కూడా చేయించాడు.
- ఈ యాగం వల్ల సంతుష్టులైన దేవతల ప్రార్థనలను మన్నించి శ్రీమహావిష్ణువు తాను రావణ సంహారార్థమై తన నాలుగు అంశలతో దశరథమహారాజుకు నలుగురు కుమారులుగా మానవజన్మఎత్తడానికి సంకల్పించాడు.
- ఎందుకంటే దేవ, దానవ, గాంధ్వ,యక్షరాక్షసులచే మరణం సంభవించని వరం పొందిన రావణుడు దేవతలను పీడిస్తున్నాడు. కనుక అతడు నరవానరులచే మాత్రమే మరణించే అవకాశం ఉంది.
- యజ్ఞపురుషుడిచ్చిన పాయసాన్ని దశరథుడు తన భార్యలైన కౌసల్య, కైకేయి, సుమిత్రలకు ఇచ్చాడు. దాంతో వారు తేజోవతులై గర్భముదాల్చారు.

- చైత్రమాస శుక్లనవమినాడు పునర్వసు నక్షత్ర, కర్కాటకలగ్నంలో కౌసల్యకు రాముడు జన్మించగా, కైకేయి పుష్యమినక్షత్ర మీనలగ్నంలో భరతుడు జన్మించాడు. ఇక సుమిత్రకు అశ్లేష నక్షత్రయుక్త కర్కాటక లగ్నంలో లక్ష్మణ,శత్రుఘ్నులు జన్మించారు. వారికి కులగురువు వశిష్టుడు నామకరణం జరిపించాడు.
- అన్నదమ్ములు నలుగురూ సకలగుణతేజోసంపన్నులు, అందులో రాముడు ప్రత్యేకించి దశరధునకూ, సకల జనులకు ప్రాణ సమానుడై ప్రకాశించాడు. లక్ష్మణుడు ఎప్పుడూ రాముడ్ని ఎడబాసి ఉండేవాడు కాదు.
- ఇంద్రాదిదేవతలు తమ అంశలతో వానర, భల్లూక వీరులకు జన్మలనిచ్చారు.

| | | |
|---|---|---|
| వాయుదేవుని అంశతో | - | ఆంజనేయుడు |
| ఇంద్ర అంశతో | - | వాలి |
| సూర్యుని అంశతో | - | సుగ్రీవుడు |
| బృహస్పతి అంశతో | - | తారుడు |
| విశ్వకర్మ అంశతో | - | నలుడు |
| అగ్ని అంశతో | - | నీలుడు |
| కుబేరుని అంశతో | - | గంధమాదనుడు |
| అశ్వనీదేవతలు అంశతో | - | మైంద ద్వివిధులు |
| వరుణ అంశతో | - | సుషేణుడు |
| వర్జన్యంశ అంశతో | - | శరభుడు |

- ఇలా మహావీరులైన వానర భల్లూక సమూహం శ్రీరామునికి రావణ సంహారంలో సహాయ పడటానికి వృద్ధిచెందింది.

⌘ **విశ్వామిత్రుని వద్ద రాముని శిష్యరకం :**

- ఒకమారు విశ్వామిత్ర మహర్షి అయోధ్యకు వచ్చి తాను చేసే యాగాన్ని మారీచ, సుభాహులనే రాక్షసులు విధ్వంసం చేస్తున్నారని, వారిని సంహరించి యాగాన్ని పరిరక్షించడానికి రాముడ్ని తనతోపంపమని దశరధున్ని కోరాడు, 15 సం॥ల బాలుడు క్రూరరాక్షసులను నిలువరించలేడు కనుక తానే సైన్యసమేతంగా వచ్చి యాగ పరిరక్షణచేయడానికి అనుమతించవలసిందిగా దశరధుడు విశ్వామిత్రుణ్ని అర్థించాడు.

అయితే దానికి విశ్వామిత్రుడు అంగీకరించలేదు. ఇక కులగురువు వశిష్టుని ప్రోత్సాహంతో దశరధుడు రాముడ్ని, లక్ష్మణుడ్ని విశ్వామిత్రుడిని పంపాడు.

- మార్గంలో ముందుగా విశ్వామిత్రుడు బల, అతిబల అనే తేజోవంతమైన విద్యలను రామునకు ఉపదేశించాడు. వీటి వలన అలసట, ఆకలిదప్పులు కలుగవు ( తాటకవధ)
- తర్వాత వీరు తాటకవనంలో ప్రవేశించాక అక్కడ మహబలవంతురాలు, మాయావి అయిన తాటక వారిని వారిని వేదించసాగింది. గురువు అజ్ఞపై రాముడు తాటకను వాడి బాణాలతో వధించాడు.
- రామలక్ష్మణులు, విశ్వామిత్రుడితో కలసి అయన ఆశ్రయము అయిన సిద్ధాశ్రమంలోకి ప్రవేశించారు. ఒకప్పుడు అది శ్రీవామనమూర్తి ఆశ్రమం. ఇది ఇలాఉండగా రాముడు శేతాశువు అస్త్రంతో ''మారీచుడ్ని'', ఆగ్నయాస్త్రంలో సుబాహుడిని దండించాడు. విశ్వామిత్రుడి యజ్ఞం నిర్విఘ్నంగా ముగిసింది.
- విశ్వామిత్రుడు శోణానది తీరాన రామలక్ష్మణులకు తన వంశగాధ చెప్పాడు. దాని ప్రకారం ఇతని వంశ మూలపురుషుడు కుశుడు. విశ్వామిత్రుడు తల్లిదండ్రులు గాధి, సోమదల, విశ్వామిత్రుడి అక్క సత్యవతి ఆమె ఋచీకుడనే మహామునిని పెండ్లాడింది. ఆమె తరువాత కౌశికి నదిగా భూలోకంలో అవతరించింది. ఆనది ఒడ్డునే విశ్వామిత్రుడు నివశిస్తున్నాడు.

⌘ **గంగావతరణ గాధ :**

- తర్వాత రాముని కోరికపై విశ్వామిత్రుడు కుమారస్వామి జన్మ వృత్తాంతాన్ని త్రిపధగామిని అయిన గంగానది అవతరణ గాధను వినిపించాడు.
- తేజోమయమైన శివుని తేజస్సును అగ్ని గంగానదికి ఇచ్చాడు. అయితే ఆమె ఆ తేజస్సును భరించలేక హిమవత్సర్వత పాదంపై తన గర్భాన్నుంచింది. అందునుండి శ్వేతపర్వతము, రెల్లుగడ్డీ జన్మించాయి. అందులో ఉద్భవించిన కుమారస్వామిని షట్కృత్తికలు పాలిచ్చి పెంచారు. ఆ కార్తికేయునికి దేవతలందరూ దేవ సేనాదాపత్యం ఇచ్చి అభిషేకించారు.
- అయోధ్యాధిపతి సగరునికి పెద్ద బార్య కౌశని వల్ల అసమంజనుడనే కొడుకు జన్మించాడు. ఇతని కొడుకు పేరు అంశుమంతుడు. సగరుడు అశ్వమేధయాగం చేసినప్పుడు దేవేంద్రుడు యజ్ఞాశ్వాన్ని హరించుకుపోయాడు. దాన్ని వెదకుతూ రెండోభార్య కుమారులైన 60,000

మంది బయలుదేరారు. భూమిని త్రవ్వుతూ పాతాళానికి వెళ్ళారు. కపిలుని సమీపంలో యజ్ఞాశ్వాన్ని చూచి కపిలున్ని నిందించారు. అయితే కపిలుని కోపాగ్నికి భస్మమైపోయారు.

- ఇది ఇలావుండగా పినతండ్రులను, గుర్రాన్ని వెదుకుతూ అంశుమంతుడు పాతాళానికి చేరి పినతండ్రుల భస్మరాశులను చూచి దుఃఖించాడు. వారి ఆత్మలు స్వర్గం చేరాలంటే వారికి గంగాజలంతో తర్పణం చేయమని గరుత్మంతుడు అంశుమంతునికి చెప్పాడు. అశ్వాన్ని తీసుకువచ్చి సగరునిచే యజ్ఞం పూర్తి చేయించిన అంశుమంతుడు సగరుని అనంతరం రాజైనాడు.
- తన తర్వాత తన కొడుకు దిలీపునకు పట్టం గట్టి అంశుమంతుడు 12000 సం॥లు తపస్సు చేశాడు.
- దిలీపుని కొడుకు భగీరధుడు 1000 సం॥లు తపస్సు చేయగా బ్రహ్మప్రత్యక్షమై భగీరధుని కోరిక మన్నించమని గంగను అనుజ్ఞఇచ్చాడు. కాని భూమిపై దూకే గంగను భరించాడు.
- ఒక శివునికే సాధ్యం, భగీరధుడు మరలా తపస్సుతో శివున్ని ప్రసన్నం చేసుకుని గంగను శిరస్సున ధరించమని కోరాడు.
- శివుని జటాజూటంలో చేరింది. ఒక పాము నేలను చేరి ఉరుకులు పరుగులతో భగీరధుని వెంట బయలుదేరింది. గంగా ప్రవాహం తన యజ్ఞశాలను ముంచినందుకు జహ్ను మహర్షి గంగను పానం చేశాడు(తాగాడు). పిదప దేవతల విన్నపాలపై తన చెవిలోనుండి వదిలిపెట్టాడు. కనుక ఆమె జహ్నవి అయ్యింది. చివరికి సగర పుత్రుల భస్మరాసుల పైనుండి ప్రవహించి వారికి ఉత్తమగతులు కలిగించింది.

⌘ **<u>అహల్యవృత్తాంతం</u>** :

- మిధిలకు వెళ్ళేదారిలో (జనకుని రాజ్యం)రామలక్ష్మణ, విశ్వామిత్రులకు శూన్యమై గౌతమాశ్రమం కనిపించింది. ఒకప్పుడు ఇంద్రుడు గౌతముని రూపంధరించి గౌతముని భార్యఅయిన అహల్యతో కలిశాడు.
- ఇందుకు గౌతముడు కోపితుడై ఇంద్రుడ్ని, అహల్యను శపించాడు. తాత్కారణంగా ఇంద్రుడు మేషవృషణుడు (1000 కన్నులు) అయినాడు. అహల్య అదృశ్యరూపంలోకి మారింది. (వాయుభక్షణచేస్తూ)

- శ్రీరాముడు ఆశ్రమంలోకి వచ్చినపుడు ఆమెశాపం తొలగిపోవడం వల్ల ఆమె అందిరికి కనిపించింది. రామలక్ష్మణులు ఆమె పాదాలను స్పృశించారు. ఆమె భక్తి, శ్రద్ధలలో వారిని పూజించింది. గౌతముదు కూడా వచ్చి వారిని పూజించాడు.

⌘ **వివాహనిశ్చయం, సీతామార కల్యాణం:**

- జనకుడు యాగ సమయంలో భూమిని దున్ను తన్నప్పుడు నాగౌటిచాళ్ళలో ఒక ఆడబిడ్డ లభించింది. అయోనిజమైన ఆమెకు సీత అని సార్ధకనామం పెట్టి జనకుడు పెంచాడు.
- ఆమె వీర్యశుల్కఅని శివధనస్సును ఎక్కుపెట్టినవారికే ఇస్తానని ప్రకటించాడు. విశ్వామిత్రుడి అనుజ్ఞతీసుకుని రాముడు అవలీలగా శివధనస్సును ఎక్కుపెట్టాడు. బ్రహ్మాండమైన ధ్వనితో అది విరిగిపోయింది.
- జనకుడు సంతోషించి, తాను అన్నట్లుగా సీతను విల్లుఎక్కుపెట్టిన రామునికిచ్చి వివాహం చేయదలిచాడు. అందుకై అతడు దశరధమహారాజుకు కబురు పెట్టాడు.
- దశరధపరివారం రాకతో జనకుని కుమార్తెలైన సీతను రామునకు ఊర్మిళను లక్ష్మణునికి, కుశధ్వజుని కుమార్తెలైన మాండవిని భరతునికి శృతికీర్తిని శతృఘ్నుడికి ఇచ్చి వివాహం చెయ్యాలని నిశ్చయించారు. చివరికి సర్వాలంకృతమైన పందిరిలో జనకుడు, వశిష్ట, విశ్వామిత్రుడు శతానందుల సమక్షంలో అగ్నిని ప్రతిష్టింపజేసి హోమం చేసి నలుగురి వివాహం జరిపించారు.

⌘ **పరుశురామగర్వభంగం, రాముడు అయోధ్య ఆగమనం :**

- ఇది ఇలా ఉండగా కాలాగ్నిలా ప్రజ్వరిల్లుతూ కైలాసగిరి సదృశుడైన పరుశరాముడు వారి యెదుట ప్రత్యక్షమయ్యాడు. దశరధరామ నీవు శివుని విల్లు విరవటం విన్నాను. ఇదిగో నాధనస్సు 'జగదగ్ని'ని ఎక్కుపెట్టి బాణం తొడుగు నీబలం చూపు అన్నాడు.
- ఈవిధంగా భార్గవరాముడు ''దశరధరామున్ని' ఆక్షేపించాడు. దశరధుని అభ్యర్ధనలను లెక్కచేయలేదు. అయితే రాముడు అవలీలగా ఎక్కుపెట్టి బాణం తొడిగాడు. ''దివ్యాస్త్రం'' వృధాకారాదు గనుక పరుశురాముని పాదగతిని కానీ, లేదా అతను తపస్సుతో సాధించుకున్న లోకాలను గానీ ఏదోఒకటి నాశనం చేస్తానన్నాడు.
- పరుశురాముడు నిర్వీర్యుడైపోయాడు. తాను కశ్యపునికిచ్చిన మాట ప్రకారం భూమిమీద నివశించజాలడు కనుక తపస్సు ద్వారా సాధించుకున్న దివ్యలోకాలను తనకు కాకుండా చేయవచ్చునని కోరాడు.

- తమకు పునర్జన్మ లభించిందని ఆనందించచిన దశరథుడు సేనా సమేతంగా గురువును, పుత్రులను, కోడళ్ళను వెంటబెట్టుకుని అయోధ్యలో ప్రవేశించాడు.
- రామాయణం బాలకాండతో మొదలవుతుండగా అది
  ''తపస్స్వా ధ్యాయ నిరతం - తపస్వివాగ్విధాం వరమ్
  నారదం పరి పప్రచ్ఛ - వల్మికిర్ముని పుంగవమ్ '' అనే శ్లోకంతో మొదలవుతుంది.
- వాల్మీకి నోటివెంట వెలువడ్డ ప్రప్రధమ శ్లోకం
  ''శ్లో. మానిషాద ప్రతిష్ఠాం త్వమగమ: శాశ్వతీస్సమా:
  యత్ క్రౌంచ మిథునాదేకమ్ అవధీ: కామ మోహితమ్.

| | | |
|---|---|---|
| 2.**అయోధ్యకాండ** | 119 | •పట్టాభిషేకం •కైకేయి కోరిక •దశరధుని దుఃఖం •సీతారామ లక్ష్మణుల వనవాసం |

- ఇది రామాయణం యొక్క రెండవ భాగము లేదా కాండము. దీన్లో మొత్తం 119 సర్గలున్నాయి.
- పట్టాభిషేకం – దశరధుడు రాజ్యభారాన్న పెద్ద కొడుకు అయిన రామునికి అప్పగించి తాను విశ్రాంతి తీసుకొనవలెనని సంకల్పించాడు. తక్కువ వ్యవధిలో చైత్రపుష్యమినాడు పట్టాభిషేకానికి సర్వమూ సిద్ధమైంది. పురవాసులంతా హర్షించారు.
- కైకకు మంధర దుర్భోధ – రాముని సవతి తల్లి అయిన కైకకు రాముడంటే వాత్సల్యము, రాముని పట్టాభిషేక సమాచారం విని సంతోషించింది. అయితే ఆమె చెలికత్తె మంధర కైకకు ఇలా నూరిపోసింది. 'రాముడు రాజయితే కౌసల్య రాజమాత అవుతుంది, నీ స్థానం బలహీనపడుతుంది. నీవు, నీ కొడుకూ తరతరాలుగా రాముని వంశానికి దాసులవుతారు. కనుక 'భరతుడ్ని' రాజుగా చేసి రాముడ్ని దూరంగా పంపే మార్గం ఆలోచించు అలా మంధర చెప్పిన మాటలు కైకకు వంటబట్టాయి.
- అంతకుముందు దశరధుడు కైకకు రెండు కోరికలు ప్రసాదించి యున్నాడు. కనుక వీటిని ఈ సందర్భంలో వాడుకోమని మంధర 'కైకేయి'కి సలహాఇచ్చింది.
- దశరధుడ్ని ఒప్పించడానికి కైకేయి విషణ్ణవదనయై ఉన్నట్లు నటించింది. అప్పుడు దశరధుడు ఆమెను ఏమి కావాలి అని అడగ్గా దేవాసుర యుద్ధంలో మీరు నాకిచ్చిన రెండువరాలు ఇప్పుడు చెల్లించాలని అడగ్గా, ఏమిటవి అని దశరధుడు ప్రశ్నించాడు.
- అప్పుడు కైకేయి (i)భరతునికి పట్టాభిషేకం, (ii)రామునకు 14సం11లు వనవాసం అని చెప్పంది. ఇది విన్న దశరధుడు కుప్పకూలిపోయాడు. ఇది ధర్మబద్ధం కాదని దశరధుడు ఎంతచెప్పినా కైక వినిపించుకోలేదు.
- ఇది ఇలా ఉండగా కైకేయి రామున్ని పిలిపించి, దశరధుని సమక్షంలోనే అంతకు ముందు దశరధుడు తనకిచ్చిన వరాల గురించి చెప్పింది. రాముడు కించెత్తినా దుఃఖం లేకుండా తండ్రి మాట ప్రకారం వనవాసానికి తాను సిద్ధమనీ వెంటనే భరతుడ్ని పిలిచి పట్టం కట్టమని చెప్పాడు.

⌘ **సీతారామలక్ష్మణుల వనవాస దీక్ష వనప్రయాణం:**

- కౌసల్య, లక్ష్మణులు ఎంత వారించినా వినకుండా రాముడు వనవాసానికి సిద్ధమయ్యాడు. అది తెలిసిన సీత తానుకూడా వనవాసానికి రాముడికి తోడుగా వెళ్తానన్నది. లక్ష్మణుడు కూడా అన్నా వదినలతో కలిసి పయనమయ్యాడు.
- సీతా, రామలక్ష్మణులు తమ సంపదలను అందరికీ దానాలు చేశారు. రాముడు తన ఆభరణాలను సుయజ్ఞుననికి, సీత తన ఆభరణాలను సుయజ్ఞునికి భార్యకు ఇచ్చారు. తర్వాత సుమంత్రుడు ఈ ముగ్గురిని రథంపై తీసుకుని ప్రయాణమ్యాడు. అందరూ దుఃఖసాగరంలో మునిగిపోయారు.
- తమసానది ఒడ్డున మొదటిరాత్రి వారు విశ్రమించారు. కోసల దేశం దాటి తర్వాత చివరికి గంగానది ఒడ్డునగల శృంగబేరిపురంకు చేరుకున్నారు.

⌘ **గుహుని ఆతిథ్యం:**

- ఇక్కడ బోయరాజైన గుహుడు సపరివారంగా వచ్చి రాముడ్ని కౌగలించుకుని ఉత్తమమైన ఆతిథ్యాన్ని ఇచ్చాడు. తన రాజ్యాన్ని ఏలుకోమని ప్రార్థించాడు. కానీ వనవాసదీక్షలో రాముడు  వీటిని నిరాకరించి గుర్రాలకు మాత్రమే మేత  ఇమ్మన్నాడు. సీతారాముడు నేలమీదే విశ్రమించారు. వారిని చూచి లక్ష్మణుడు దుఃఖించాడు. వెనుకకు వెళ్ళడానికి మనసొప్పని సుమంత్రునికి నచ్చజెప్పి రాముడు అతడ్ని అయోధ్యకు పంపాడు. గుహుడు ఏర్పాటు చేసిన నావలో సీతారామలక్ష్మణులు గంగానదిని దాటారు.

⌘ **చిత్రకూట నివాసం :**

- సీతారామలక్ష్మణులు ప్రయాగవద్ద భరధ్వాజాశ్రమానికి చేరుకున్నారు. ముని వారిని ఆదరించి అక్కడే వనవాస కాలాన్ని గడపమన్నాడు. కానీ అది జనవాసాలకు సమీపంలో ఉన్నందున అక్కడ ఉండటానికి రాముడు ఇష్టపడలేదు.
- తర్వాత భరద్వాజ మహర్షి సూచన ప్రకారం ఒక తిప్ప తయారుచేసుకొని యమునానదిని దాటి చిత్రకూటం అనే సుందరమైన ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ లక్ష్మణుడు ధృఢమైన పర్ణశాలను నిర్మించాడు.

⌘ **దశరథుని మరణం మరియు భరతుని దుఃఖం:**

- సుమంత్రుడు అయోధ్యనగరానికి వచ్చి జరిగినదాంతో దశరధుడికి చెప్పగా అతడు మిక్కిలి విలపిస్తుండేవాడు. దశరధుడు యవ్వనంలో శబ్దవేద విద్యలో ప్రజ్ఞుడు అయితే తన

పొరపాటు కారణంగా నీటి మడుగులో ఉన్న మునికుమారుడ్ని బాణంతో కొట్టగా అతడు మరణించాడు. దాంతో అంధులైె అతడి తల్లిదండ్రులు విలపిస్తూ తమకు కలిగిన పుత్రశోకం దశరధుడికి కూడా కలుగుతుందని శపించాడు. దీని గురించి దశరధుడు కౌసల్య, సుమిత్రులకు చెప్పి దుఃఖిస్తూ, రామునికై విలపిస్తూ మరణించాడు.

- అయోధ్య శోక సంద్రంలో మునిగింది. వెంటనే రాజ్య పట్టాభిషేకానికి రమ్మని గిరివ్రజంలో మేనమామ ఇంట ఉన్న భరతునికి వశిష్టుడు కబురుపెట్టాడు. జరిగిన విషయములన్నింటిని తెలుసుకున్న భరతుడు కోపంతో, రోషంతో దుఃఖంతో తల్లిపై మండిపడ్డాడు.
- వసిష్టుని ఆదేశం మేరకు భరతుడు తండ్రి అంతిమ (అగ్ని) సంస్కారం చేశాడు. 12వ రోజున శ్రాద్ధ కర్మలన్నీ పూర్తి చేశాడు. 14వ రోజున భరతుణ్ని రాజ్యాభిషిక్తుడ్ని కమ్మని రాజాద్యోగులు కోరారు.
- భరతుడు వారికి నమస్కరించి నిరాకరించాడు. రాముడే రాజు కావాలని, రాముణ్ని అయోధ్యకు తెచ్చి అభిషిక్తుడిని చేసి తాను మాత్రం తల్లికోరికకు వ్యతిరేకంగా అడవులకుపోతానని ధృడంగా అన్నాడు.

## ⌘ చిత్రకూటానికి భరతుని ప్రమాణాలు, పితృవాక్యపాలన

- రాముడ్ని రాజుగా చేయడానికి అయోధ్యకు పిలవాలని భరతుడు సపరివారంగా బయలుదేరాడు. సైన్యంతో వస్తున్న భరతుణ్ని చూచి లక్ష్మణుడు భరతుడు యుద్ధానికి వస్తున్నాడేమోనని అపోహపడ్డాడు.
- సైన్యాలను దూరంగా ఉంచి భరతుడు సీతారాములక్ష్మణుల పాదాలపై పడి నోటమాట రానంతగా విలపించాడు.
- రాముడు భరతుడ్ని లేవనెత్తి కుశలమడిగాడు, పుత్రశోకంతో తండ్రి మరణించాడన్న వార్త తెలియగానే రాముడు మూర్ఛిల్లాడు. పిదప లేచిన రాముడు అమితంగా దుఃఖిస్తూ మందాకినీ జలాలలో దశరధుడికి తర్పణం వదిలాడు.
- భరతుడు దీనంగా ప్రార్థిస్తూ నేను నీ భృత్యుడిని, నీకు చెందవలసిన రాజ్యాన్ని నేను పొందలేను. నాపై దయవుంచి నీరాజ్యం నీవు గ్రహించి మమ్ములను అనుగ్రహించుఅని కోరాడు అప్పుడు రాముడు ‘‘తండ్రి నీకు రాజ్యము, నాకు వనవాసదీక్ష ఇచ్చాడు. ఇద్దరమూ వీటిని అలా అనుభవించాల్సిందే’’ అని బదులిచ్చాడు.

⌘ శ్రీరాముని పాదుకల రాజ్యం

- శ్రీరాముని తిరస్కారంతో భరతుడు దర్భలు పరుచుకుని పడుకుని అన్నపానాదులు ముట్టలేదు. చివరకి రాముడు అతడికి నచ్చజెప్పి పితృఋణం తీర్చుకోవడంలో ఆటంకాలు కల్పించవద్దని, తల్లి అయిన కైకను ఇబ్బంది పెట్టవద్దని, వెళ్ళి రాజ్యాన్ని ఏలుకోమని చెప్పాడు.
- రాజధర్మం కూడా రాముడి వద్దనుండి విన్న భరతుడు, శ్రీరాముణ్ని పాదుకలను అనుగ్రహించమని కోరాడు. అందుకు రాముడు సమ్మతించాడు. 14సం॥లు తాను కందమూలాలు మాత్రమే తింటూ, నగరం బయటనే నివశిస్తూ, అన్నగారి పాదుకల పేరనే రాజ్యం చేస్తానని భరతుడు చెప్పాడు.
- 14సం॥లు తర్వాత రాముడ్ని చూడకపోతే అగ్నిలోకి దూకుతాన్నాడు. అందరికా నమస్కరించి పాదుకలు శిరస్సున ధరించి అయోధ్యకు తిరుగుప్రయాణమయ్యాడు. అందరినీ అయోధ్యకు పంపి భరతుడు తాను మాత్రం నందిగ్రామంలోనే ఉండిపోయాడు.
- చిత్రకూటంలో ఉండటం ఇష్టంలోని రాముడు, సీతాలక్ష్మణ సమేతంగా అత్రిమహర్షి ఆశ్రమానికి చేరుకున్నాడు. అత్రిభార్య అనసూయ. ఆమెకు సీతాదేవి వందనం చేసింది. అనసూయ సీతకు పతివ్రతా ధర్మాలను ఉపదేశించింది.

| | | |
|---|---|---|
| 3.అరణ్య కాండము | 75 సర్గలు | •వనవాసం •మునిజన సందర్శనం<br>•రాక్షస సంహారం •శూర్పణఖ భంగం •సీతాపహరణము |

⌘ విరాధ వధ

- అత్రిమహర్షి, అనసూయల ఆశీర్వచనలు పొంది సీతా,రామలక్ష్మణులు దండకారణ్యంలో ముందుకు సాగారు. వారికి భారీ శరీరంలో వికృతంగా ఉన్న విరాధుడనే రాక్షసుడు ఎదురుపడ్డాడు.
- అతడు నిజానికి తుంబురుడనే గంధర్వుడు గానీ కుబేరుని శాపకారణంగా రాక్షసుడయ్యాడు. అతనికి ఏ శస్త్రంతోనూ చావకుండా వరముంది. రామునిచేతినే అతనికి శాపవిముక్తి కావాలి.
- ఆ విరాధుడు సీతను పట్టుకుపోసాగాడు. కాని రాముని పదునైన బాణాల వల్ల కోపించి సీతను విడిచి రామలక్ష్మణులను చేతులలో ఇరికించిపోసాగాడు.

- రామలక్ష్మణులు విరాధుని చేతులు నరికివేశారు. శాపవిముక్తి కల్గిన విరాధుడు వారెవరో తెలుసుకుని రాముడ్ని శరభంగమహర్షి ఆశ్రమానికి వెళ్ళమని చెప్పాడు.

⌘ **ముని ఆశ్రమాల సందర్శనం**

- బ్రహ్మ సాక్షాత్కారం పొందిన శరభంగమహర్షి రాముని కోసమే తాను బ్రహ్మలోకానికి వెళ్ళకుండా వేచియున్నాడు. తన తపస్సు పుణ్యాన్ని రామునికి సమర్పించి వారిని సుతీక్షమహర్షి ఆశ్రమానికి వెళ్ళమన్నాడు. తరువాత శరభంగుడు యోగశక్తితో అగ్నిని ప్రజ్వలింపజేసి అందులో భస్మమై బ్రహ్మలోకం చేరుకున్నాడు.
- ఎందరో మునులు రాముని కలసి తాము రాక్షసుల వల్ల పడే బాధలు చెప్పుకున్నారు. దాంతో రాముడు వారికి రాక్షస బాధ లేకుండా కాపాడతానని అభయమిచ్చాడు. తర్వాత సీతారామలక్ష్మణులు సుతీక్షమహర్షి ఆశ్రమానికి వెళ్ళారు. ఆ మహర్షి కూడా రాముని దర్శనం కోసమే దేవలోకం వెళ్ళకుండా వేచియున్నాడు. స్వయంగా ఫలమాలలు వారికి వడ్డించి ఆదరించాడు.
- తర్వాత రామలక్ష్మణులు ఆయుధాలు ధరించి సీతా సమేతంగా దండారణ్యంలో ఉన్న అనేక మునుల ఆశ్రమాలను చూడటానికి బయలుదేరాడు. దారిలో వారు పంచాప్సరసం అనే సుందరమైన తటాకాన్ని చూశారు. మాండకర్ణి అనే మహర్షి, తన తపోబలంతో దానిని నిర్మించి అందులో నీటి అడుగున అప్సరసతో క్రీడిస్తున్నందున అక్కడ ఎప్పుడూ మధురమైన సంగీతం వినిపిస్తున్నది.
- తర్వాత సీతారామలక్ష్మణులు అగస్త్యమహర్షి ఆశ్రమానికి వెళ్ళి, ఆముని ఆతిధ్యాన్ని స్వీకరించారు. అగస్త్యుడు మృత్యువును జయించిన మహాతపస్వి, వింధ్య పర్వతం పెరుగుదల ఆపాడు. నరమాంస భక్షకులైన వాతాపి, ఇల్వలును నాశనం చేశాడు. దక్షిణ దిక్కును మునులకు ఆవాసయోగ్యంగా చేశాడు.
- సీతారామలక్ష్మణులు అగస్త్యునికి పాదాభివందనం చేశారు. అగస్త్యుడు వారిని ఆదరించి రామునికి విశ్వకర్మ నిర్మించిన గొప్ప వైష్ణవ ధనస్సును రాముడికిచ్చాడు. సీత యొక్క పతివ్రతా ధర్మాన్ని శ్లాఘించాడు.

⌘ **పంచవటిలో నివాసం, శూర్పణఖభంగం**

- సీతారామలక్ష్మణులను గోదావరి తీరంలోని పంచవటి వద్ద ఆశ్రమంను నిర్మించుకుని నివశించమని అగస్త్యుడు సూచించాడు. పంచవటికి వెళ్ళేదారిలో వారికి జటాయువు అనే

పెద్ద గ్రద్దరాజు కనిపించాడు. తాను దశరథుని మిత్రుడునని ఆశ్రమ సమీపంలో సీతను కనిపెట్టుకుని ఉంటానని అన్నాడు.

- పంచవటిలో రాముడు చూపిన స్థలంలో లక్ష్మణుడు చక్కటి పర్ణశాలను నిర్మించాడు. అక్కడ వారు చాలా సంతోషంగా గడిపారు.
- రావణుని చెల్లెలు శూర్పణఖ అనే రాక్షసి ఆ అడవిలో స్వేచ్ఛగా సంచరిస్తున్నది. ఆమె కామరూపి. ఒకసారి పర్ణశాలకు వచ్చి రాముడ్ని చూసి మోహించి తనను పెళ్ళిచేసుకోమని అడిగింది. దాంతో రామలక్ష్మణులు ఆమెతో పరిహాసాలాడారు. దాంతో కోపించిన సీతను తినివేయబోయింది. దాంతో రాముని యొక్క ఆజ్ఞతో లక్ష్మణుడు శుర్పణఖ యొక్క ముక్కు, చెవులు కోసివేశారు.
- శూర్పణఖ యేడుస్తూ తన సోదరుడైన ఖరునితో జరిగిన విషయం మొరపెట్టుకుంది. ఖరుడు 14మంది రాక్షసులను రామునిపైకి పంపాడు. అయిన వారు రాముని చేతిలో సంహరింపబడ్డారు. తర్వాత ఖరుడు తన సేనాపతి దుషణుడు మరియు 14000 మంది రాక్షసులలో రామలక్ష్మణులపై దండెత్తారు.
- ఖరుడు అతని సైన్యం పెద్ద పొలికేకతో రామునిపై యుద్ధానికి దిగారు. యమపాశాల వంటి రాముని బాణాలకు ఎందరో రాక్షసవీరులు నేలకూలారు. చివరికి దూషణుడు, ఖరుడు లు సైతం నేలకొరిగారు. భీకరంగా జరిగిన యుద్ధంలో రణభూమి అంతా రక్తమాంసాలతో నిండి పోయింది.

⌘ **రావణుడితో శూర్పణఖ గోడు**

- 14000 మంది రాక్షసులు, ఖరుడు, దూషణుడు, త్రిశిరుడు మరణించడంతో శూర్పణఖ పెడబొబ్బలు పెడుతూ లంకకు పోయింది.
- తన పెద్దన్న రావణున్ని తీవ్రంగా నిందించి, నువ్వు స్త్రీలోలుడవై రానున్న అపాయాన్ని తెలిసికోలేకపోతున్నావు అని అన్నది.
- రామలక్ష్మణులను సంహరించి అందాలరాశి అయిన సీతను  నీసొంతం చేసుకో అన్న శూర్పణఖ మాటలకు రావణుడు సీతను అపహరించి తేవడానికి సిద్ధమయ్యాడు.
- దీనికోసం ఒక పన్నాగం ఆలోచించి, మారీచుని వద్దకు వెల్యాడు. సీతాపహరణం కోసం మాయలేడిగా రాముడ్ని దారి తప్పించడానికి సహాయపడమన్నాడు.

### ⌘ మారీచుని హితము

- రాముడి పేరు వినేసరికి మారీచుని ముఖంలో ప్రేతకళ వచ్చేసింది. భయంతో కొయ్యబారిపోయి, రావణునికిలా హితం బోధించాడు. రాముడు మహావీరుడు, సత్యధర్మవ్రతుడు, అతనితో వైరం పెట్టుకుంటే నీకు, నీజోలికి పోగాలం దాపురించినట్లే, ఇంతకుముందు విశ్వామిత్రుడి యుగంలో అతడి బలాన్ని చూశాను. నన్ను అతడు నూరామడలు దూరంలో ఉన్న సముద్రంలో పారవేశాడు. అప్పటి నుండి నాకు 'ర' అక్షరంతో మొదలయ్యే రథం, రత్నం వంటి పదాలకే వణుకు పుడుతున్నది అని అన్నాడు. శరణువిడమని చెప్పాడు.
- రావణుడు కఠినంగా ఇలా అన్నాడు – దేవతలు ప్రార్థించినా నానిశ్చయం మారదు. నువ్వు బంగారులేడివై సీతను ఆకర్షించాలి. ఆ విధంగా రామలక్ష్మణులను పర్ణశాలనుండి దూరంగా పంపాలి. అది చేయకపోతే నాచేతిలో నీకు చావుతప్పదు.
- ఇక మారీచునికి మార్గంతోచలేదు. దిక్కులేక రావణుడి చేతిలో చచ్చేకంటే రాముడిచేతిలో చావడం మంచిదని నిర్ణయించుకున్నాడు.

### ⌘ మాయాలేడితో మోసం

- సీతపర్ణశాల వద్ద పూలుకోసుకుంటూ ఇక అరణ్యవాసం ఎంతోకాలం లేదనుకుంటుంది. కానీ ఆ సమయంలో ఆమెకు వెండి చుక్కలలో మెరుస్తున్న అపూర్వమైన బంగారు లేడి కంటపడింది. దానికి సీత ముగ్ధురాలైంది.
- దీన్ని తెచ్చిపెట్టమని రామున్ని కోరింది. అది రాక్షసమాయ అని లోకంలో అలాంటి లేడులుండవని లక్ష్మణుడు గట్టిగా చెప్పాడు.
- రాక్షసుడైతే చంపివస్తానని అంవరకూ సీతను జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉండమని లక్ష్మణునునితో చెప్పి రాముడు బయలుదేరాడు.
- ఆలేడి గెంతుతూ, మాయమవుతూ మళ్ళీ కనబడకుండా రాముడ్ని చాలాదూరం తీసుకుపోయింది. ఇక లాభం లేదనుకుని రాముడు ధనస్సు ఎక్కుపెట్టి బాణం విడిచాడు.
- దీనితో ఆ లేడి మారీచునిగా మారింది, మారీచుడు అయ్యో సీతా, అయ్యే లక్ష్మణా అని బిగ్గరగా అరుస్తూ ప్రాణాలు విడిచాడు. ఆపదను శంకించిన రాముడు వడివడిగా పర్ణశాలవైపు సాగాడు.

- ఇది ఇలా ఉండగా ఆ ఆర్తనాదంవిని సీత రామునికి అపాయమేదో సంభవించినది అని తలచి రామునికి సహాయంగా త్వరగా వెళ్లమని లక్ష్మణున్ని కోరింది. ఇది రాక్షస మాయ అని రాముడ్ని ఎవరూ ఏమిచేయలేదని నీకు మీరక్షణార్థమై ఉంటానని లక్ష్మణుడు అన్నాడు. దీంతో కోపించిన సీత లక్ష్మణుడ్ని పరుషంగా దూషించింది. ఆ నిందలకు చింతించిన లక్ష్మణుడు వనదేవతలు సీతను రక్షించాలని కోరుకున్న రాముని అన్వేషణకై బయలు దేరాడు.

⌘ **సీతాపహరణం, జటాయువు మరణం**

- ఇదే అదనుగా చూసుకుని రావణుడు సన్యాసి వేషంలో వచ్చి సీతను పలకరించాడు.వచ్చింది రావణుడు అని తెలీక సీత అతడికి అతిధి మర్యాదలు చేసింది. కొంతసేపటికి రావణుడు తన నిజరూపం చూపి సీతను తనకు భార్యనుకమ్మన్నాడు. దీన్ని సీత తీవ్రంగా నిరసించింది. అయినప్పటికీ రావణుడు బలవంతంగా సీతను ఒడిసిపట్టుకుని తన రథం ఎక్కాడు. సీత ఆర్తనాదాలు విన్న జటాయువు రావణుని మీద విజృభించాడు.
- జటాయువు బలంగా డీకొని, రక్కినా రావణున్ని ఆపలేకపోయారు. రావణుడు జటాయువుని తెగనరికాడు. జటాయువు నేలబడికొన ప్రాణంలో మూలుగుతుండగా రావణుడు ఆకాసమార్గంలో లంకవైపు సాగిపోయాడు.
- దారిలో ఒక కొండపై కొందరు వానరులు కనబడ్డారు. రావణుడు చూడకుండా సీత తన నగలు కొన్ని మూటగట్టి వారి మధ్యకు విసిరింది. రావణుడు సీతతో లంకకు చేరి అక్కడ ఆమెను అశోకవనంలో ఉంచాడు. రాక్షస స్త్రీలు ఆమెకు కాపలాగా ఉన్నారు.
- రామలక్ష్మణులు పర్ణశాలకు వచ్చి చూడగా సీత కన్పించలేదు. అంతట దుఃఖిస్తూ అంతటా వెదకసాగారు. దక్షిణం వైపుకు కదలగా వారికి రక్తసిక్తమై నేలపై పడి ఉన్న జటాయువు కనిపించాడు. జరిగినదంతా చెప్పి రాముని ఒడిలో జటాయువు ప్రాణాలు విడిచాడు.
- రాముడు జటాయువుకు అగ్ని సంస్కారాలు చేసి లక్ష్మణుడితో కలిసి సీతను వెదకడానికై ముందుకు సాగాడు.

⌘ **కబంధుని శాప విమోచన, శబరి సేవ**

- వీరికి మతంగాశ్రమం సమీపంలో కబంధుడనే మహాకాయుడైన ఒక రాక్షసుడు ఎదురుపడ్డాడు. వాడికి తల, మెడ కూడా లేవు. వాడి ముఖం కడుపు మీద ఉంది. శరీరం

పర్వతంలా ఉంది. వాడు శాపగ్రస్తమైన గంధర్వుడు. రామలక్ష్మణులను తినబోయాడు. దాంతో వారు కబంధుడు చేతులు నరికారు. దాంతో అతడికి శాపవిమోచనం జరిగింది.

- దీంతో కబంధుడు రామునికి ఇలా సలహా ఇచ్చాడు. ప్రస్తుతం నీవు సుగ్రీవునితో స్నేహం చేసుకుంటే సీతను వెతకడంలో అతడు నీకు సహాయపడతాడు. అలానే శబరిని దర్శించుకో అని చెప్పాడు.
- సిద్ధురాలైన శబరి మతంగాశ్రమంలో మునులకు సపర్యలు చేస్తూ ఉండేది. ఆమె గురువులు స్వర్గానికి వెళ్ళినా ఆమె కేవలం శ్రీరాముని దర్శనార్థమై వేచి ఉంది.
- రామలక్ష్మణుల పాదాలకు మొక్కింది. మధురమైన ఫలాలతో వారికి అతిధి పూజ చేసింది. రాముడి ఆనందం పిదప సెలవియ్యమంది. రాముడు ఆమెకు ఇష్టం వచ్చిన లోకాలకు వెళ్ళమన్నాడు. దీంతో వృద్ధ శబరి తన జీర్ణ దేహాన్ని అగ్నిలో ఆహుతి చేసుకుని గురువులు ఉన్నచోటికి విమానంలో వెళ్ళిపోయింది
- అటుపిమ్మట రామలక్ష్మణులు పంపా సరస్సుకు చేరుకున్నారు. ఎన్నో పక్షులు, పూలతో నిర్మలమైన నీటితో ఆ సరస్సు అతి మనోహరంగా ఉంది.

| | | |
|---|---|---|
| 4.**కిష్కింధ కాండము** | 67 సర్గలు | •రాముని దుఃఖం •హనుమంతుడు రామ,సుగ్రీవులు మధ్య స్నేహం కుదుర్చుట •వాలివధ •సీతాన్వేషణం |

⌘ **హనుమంతుడు రామలక్ష్మణులను కలుసుకొనుట**

- రామలక్ష్మణులు శబరి ఆతిధ్యం తరువాత పంపాసరోవరం అందాలను చూస్తూ ఋష్యమూక పర్వతంను సమీపించారు. ఇక్కడే అన్న వాలి కోపానికి కారణమై తన వారితో కలసి సుగ్రీవుడు జీవిస్తున్నాడు. మహాధనుర్ధారులైన రామలక్ష్మణులను చూచి సుగ్రీవుడు భయం చెందాడు. వారిని గురించి తెలుసుకోమని హనుమంతుని పంపాడు.
- హనుమంతుడు వారి దగ్గరకి బ్రహ్మచారి రూపంలో వెళ్లి కూపీ లాగాడు. తాను సుగ్రీవుడు అనే వానరుడు యొక్క మంత్రిని అని చెప్పి, సుగ్రీవుడి గురించి తెలియజేశాడు. అంతేకాక సుగ్రీవుడు మీ స్నేహాన్ని కోరుతున్నాడు అని అన్నాడు.
- హనుమంతుని మాటలకు రాముడు ముగ్ధుడయ్యాడు. హనుమంతుని కీర్తించాడు. ఇదే సందర్భంలో రాముని ఆనతిపై లక్ష్మణుడు తమరాకకు కారణాన్ని హనుమంతునికి వివరించాడు. దీంతో హనుమంతుడు నిజరూపం ధరించి రామలక్ష్మణులను తన భుజాలపై ఎక్కించుకొని సుగ్రీవుని వద్దకు తీసుకొని వెళ్ళాడు.

⌘ **శ్రీరామ సుగ్రీవుల మైత్రి**

- హనుమంతుని ద్వారా వారి వృత్తాంతాన్ని విని సుగ్రీవుడు రామలక్ష్మణులను స్వాగతించి ఆదరించాడు. సీతను వెదకడానికి తాను సహాయపడగలను అని అన్నాడు. కొద్ది రోజుల క్రితం ఒక స్త్రీని ఒకరు ఎత్తుకు పోతుండగా ఆమె నగలను విడిచిందిఅని ఆ నగలను శ్రీరామునికి చూపగా రాముడు బావురుమన్నాడు(నగలను గుర్తుపట్టాడు).
- రాముడు అడుగగా సుగ్రీవుడు తనకూ తన అన్నకూ వైరం ఏర్పడిన కారణాన్ని వివరించాడు. కిష్కింధ రాజైన వాలికి సుగ్రీవుడు తమ్ముడు, విధేయుడు. ఒకమారు మాయావి అనే రాక్షసునితో యుద్ధంచేస్తూ, వాలి ఒక బిలంలోకి వెళ్ళిపోయాడు. బిలం బయటే ఉండమని వాలి తన తమ్మునకు చెప్పాడు. ఒక మాసం గడిచినా వారు వెలుపలికి రాలేదు.
- రాక్షసుని చేతిలో వాలి మరణించి ఉంటాడని భయపడ్డ సుగ్రీవుడు బిలం ద్వారాన్ని ఒక బండరాయితో మూసి నగరానికి తిరిగి వచ్చాడు. మంత్రులు సుగ్రీవుడిని రాజుగా అభిషేకం చేశారు. వాలి తిరిగి వచ్చి సుగ్రీవుణ్ణి నిందించి, దండించాడు. అతని భార్య రుమను చేబట్టి సుగ్రీవుణ్ణి రాజ్యం నుండి తరిమివేశాడు. దీనుడైన సుగ్రీవుని కథ విని రాముడు తాను వాలిని సంహరిస్తానని మాట ఇచ్చాడు.
- రాముడి బలాన్ని తెలుసుకున్న సుగ్రీవుడు వాలిని యుద్ధానికి పిలిచాడు. అన్నదమ్ములిద్దరూ భీకరంగా పోరాడారు. ఇద్దరూ ఒకేలా కనిపించారు రాముడికి. క్రమంగా సుగ్రీవుడి శక్తి క్షీణించి ఓడిపోయాడు. యుద్ధ సమయములో ఉపేక్షించినందుకు రామునితో నిష్ఠూరంగా మొరపెట్టుకొన్నాడు సుగ్రీవుడు.
- అసలు కారణం వివరించి రాముడు సుగ్రీవునికి ధైర్యం చెప్పాడు. ఆనవాలుగా ఒక గజ పుష్పలతను సుగ్రీవుడి మెడలో ధరించాడు. మళ్ళీ సుగ్రీవుడు కిష్కింధకు వెళ్ళి వాలికి కనిపించాడు. కోపోద్రిక్తుడైన వాలిని అతని భార్య తార వారించే ప్రయత్నం చేసింది, కాని వాలి వినలేదు.
- అన్నదమ్ములు మళ్ళీ భీకరంగా పోరాడసాగారు. వాలికి ఇంద్రుడు ఇచ్చిన కాంచనమాల వరప్రభావం వలన ఎదురుగా పోరాడే వారి శక్తిలో సగం వాలికి సంక్రమిస్తుంది. కనుక క్రమంగా సుగ్రీవుని బలం క్షీణించసాగింది. ఆ సమయంలో రాముడు వాలిని బాణంతో కొట్టాడు. వాలి మూర్ఛపోయాడు.

- కొంత సేపటికి వాలికి తెలివి వచ్చింది. అతని గుండెల నుండి రక్తం ధారలుగా పారుతున్నది. రామ నీవు మహా తేజోవంతుడువు. కానీ నీవు చేసిన ఈ నీచమైన పని వల్ల నీవంశానికి, నీ తండ్రికి అపకీర్తి తెచ్చావు. నేను నీకు గానీ, నీ దేశానికిగాని ఎటువంటి కీడుచేయలేదు. ఆయినా నన్ను వధిస్తున్నావు. నీవు క్షుద్రుడవు, మహాపాపివి అంటూ నిందించాడు.
- నీవు నా ఎదుటపడి యుద్ధం చేసే ధైర్యం లేక చెట్టు మాటు నుండి బాణం వేసావు. అందుకు నీకు సిగ్గు కలగడం లేదా, నా సహాయమే కోరివుంటే క్షణాలమీద రావణుని నీ కాళ్ళ వద్ద పడవేసి, నీ భార్యను నీకు అప్పగించే వాడిని.
- సుగ్రీవుడు నా అనంతరం రాజార్హుడే, కానీ ఇలా కుట్రతో నన్ను చంపి నా తమ్ముడికి రాజ్యం కట్టబెట్టడం నీకు తగిన పని కాదు అని అన్నాడు.
- వాలి పలుకులను ఆలకించిన రాముడు శాంతంగా ఇలా అన్నాడు. నేను వేటమిష మీద నిన్ను చంపలేదు. ధర్మ రక్షణార్థమే నిన్ను చంపాను. మీ తమ్ముడు బ్రతికుండగానే అతని భార్యను నీ వశం చేసుకున్నావు. నీ ప్రవర్తనలో దుష్టత్వం ఉంది. అందుకు మరణదండనే సరైన శిక్ష. కనుక మన మధ్య ప్రత్యక్ష వైరం లేకున్నా నిన్ను శిక్షించాను.
- ఇక చెట్టు చాటునుండి చంపటం గురించి, నీ మెడలోని కాంచనమాల వర ప్రభావాన్ని నేను మన్నించాలి. ధర్మాన్ని విడిచినవాణ్ని వధించడానికి యుద్ధ ధర్మాలు వర్తించవు.
- నీ వధకు మరొక అలౌకిక పరమార్ధ కారణం ఉంది. నీవు ఇంద్రాది పుత్రుడవు. సృష్టి కర్త ఆజ్ఞ మేరకు రావణవధలో వానరులు నాకు సహకరించాలి. కానీ నీవు రావణుడికి మిత్రుడు అయ్యావు. కనుక నువ్వే నాకు సహాయపడితే మిత్రద్రోహి అవుతావు. రావణుడి పక్షాన ఉండే పితృ ద్రోహివి అవుతావు. అలాంటి మహాపాతకాలు నిన్ను అంటకుండా నేను నిన్ను రక్షించానని రాముడు చెప్పాడు.
- దాంతో వాలి ఇలా అన్నాడు, రామా! సర్వజ్ఞుడవైన నీకు బదులు చెప్పగలిగే వాడను కాను. నీ చేతిలో మరణించడం నా పూర్వ జన్మ సుకృతం. నాకొడుకు అంగదున్ని సుగ్రీవుని లాగా రక్షించు. నామీద కోపంతో సుగ్రీవుడు తారను హింసించకుండా చూడు. నా ప్రేలాపన అపరాధాలను మన్నించు అని చెప్పి సుగ్రీవుడిని పిలిచి అతడికి తన మెడలోని కాంచనమాలను ఇచ్చాడు.

- పిన తండ్రిని కూడా తండ్రిని లాగానే గౌరవించమని అంగదునికి చెప్పాడు. దేశ కాలాలు గుర్తించి ప్రభువు పట్ల విధేయుడై ఉండాలన్నాడు. ఎవరితోనూ అతి స్నేహమూ, తీవ్ర వైరము మంచిదికాదని చెప్పి నోరు తెరిచి మరణించాడు.
- అందర్నీ ఓదార్చి రాముడు అంత్యక్రియలను జరపమన్నాడు.
- వర్షరుతువులో సీతాన్వేషణ సాధ్యంకాదని రాముడు దుఃఖించాడు. అంతవరకూ కిష్కింధలో ఉండి సుఖభోగాలు అనుభవించమని సుగ్రీవునితో అన్నాడు. కార్తీక మాసం రాగానే రావణ వధకు సిద్ధం అవుదామని రాముడు అన్నాడు.

**⌘ సుగ్రీవుని పట్ల లక్ష్మణుడి ఆగ్రహం సీతాన్వేషణ ఆరంభం**

- వర్షాలు ఆగి ఆకాశం నిర్మలమయ్యింది. కాని సుగ్రీవుడు ధర్మార్థ విముఖుడై రేయింబవళ్ళు కామ భోగాలతోనే గడుపుతున్నాడు. ఆ సమయంలో హనుమంతుడు సుగ్రీవుని వద్దకు వెళ్లి మహావీరా, నీవు రాజ్యాన్ని యశస్సును పొందడానికి కారణమైన శ్రీరామచంద్రుడు కార్యాన్ని ఉపేక్షించడం తగదు. వెంటనే సీతాన్వేషణకు మమ్ములను అజ్ఞాపించు అని హితం పలికాడు.
- మరోవైపు రాముడు వియోగంతో కుములుతున్నాడు. చేసిన మేలును మరచి అలసత్వం వహిస్తున్న సుగ్రీవుని ప్రవర్తన రామునికి మరింత బాధ కలిగించింది. అది చూచి లక్ష్మణుడికి ఆగ్రహం పెల్లుబికింది. అగ్నిహోత్రునిలా మండిపడుతూ కిష్కింధకు వెళ్ళాడు. తార లక్ష్మణుణ్ణి ప్రాధేయపడి సుగ్రీవుడు మిత్ర ధర్మాన్ని పాటిస్తాడని చెప్పింది. సుగ్రీవుడు కాస్త ధైర్యం తెచ్చుకొని తన అపరాధాన్ని మన్నించమని వేడుకున్నాడు. సమస్త వానర గణాలను కిష్కిందకు రావాలని ఆజ్ఞాపించాడు.
- సుగ్రీవుని ఆజ్ఞపై సేనలను సమకూర్చుకుని వినతుడు తూర్పువైపు. సుషేణుడు పడమరవైపు, శతబలుడు ఉత్తరదిశకు, అంగదుడు దక్షిణదిశకు బయలుదేరారు. ఒక నెలలోపులోనే సీతాన్వేషణ పూర్తి కావాలని, సీతమ్మ జాడ తెలిపిన వారికి తనతో సమానంగా రాజభోగాలను కల్పిస్తానని మాట ఇచ్చాడు. దక్షిణం వైపు వెళ్లిన బృందంలో జాంబవంతుడు, నీలుడు, హనుమంతుడు కూడా ఉన్నారు. సుగ్రీవుడు రామణుడు దక్షిణంవైపు ఉన్నాడని నమ్మాడు. అందువల్ల శ్రీరాముడు తన అంగుళీయకాన్ని సీతకు ఆనవాలుగా ఇమ్మని హనుమంతుడికి ఇచ్చాడు.

- సుగ్రీవునికి గల భౌగోళిక జ్ఞానం రామున్ని ఆశ్చర్యపరిచింది. దక్షిణ దిశగా వెళ్లిన వీరులు, ప్రతిచోట గాలిస్తూ వింధ్య పర్వతం దాటారు. రజిత పర్వతంపై వెదికారు. చివరి మేరా సావర్ణిపుత్రిక తపశ్శక్తితో వారిని దక్షిణదిశలో సాగర తీరానికి చేర్చింది.
- ఆ సాగరాన్ని చూసి అంగదుడు ఆశలు అడుగంటాయి. ఇక మరణమే శరణ్యం అని అనుకుంటుండగా ఆ మాటలు విన్న సంపాతి అనే మహాకాయుడైన గ్రద్ద వచ్చాడు. వారి మాటలను బట్టి తన తమ్ముడైన జటాయువు మరణించాడని దుఃఖించాడు. రావణుడు అనే రాక్షసుడు సీతను ఎత్తుకుని పోయి సముద్రంలో నూరు యోజనాల అవతల లంకానగరంలో దాచాడు అని వారికి చెప్పాడు.
- సీత జాడ తెలిసినప్పటికీ సముద్రంను ఎలా దాటాలన్నదే వానరుల ఆలోచన. వృద్ధుడైన జాంబవంతుడు 90 యోజనాలు మాత్రమే ఎగరగలనన్నాడు. అంగదుడు 100 యోజనాలు వెళ్ళగలను కానీ తిరిగి రాకపోతే అని అనుమానం వ్యక్తం చేశాడు. ఈ సమయంలో జాంబవంతుడు హనుమంతునితో ఇలా అన్నాడు. నాయనా ఈ కష్టాన్ని తరింపచేయడానికి నిన్ను మించిన సమర్ధుడు లేడు. గరుత్మంతుని తో సమానమైన వేగ విక్రమాలుకలవాడవు. నీ శక్తి నీకు తెలియదు. నువ్వు వాయు పుత్రుడవు. సముద్రం దాటడం నీకు కష్టం కాదు అని చెప్పాడు. ఉత్సాహపరిచాడు.
- దాంతో హనుమంతుడు అందరి ఆశీర్వచనం తీసుకొని దీర్ఘ దేహుడై సీతమ్మను చూసి రామకార్యం నెరవేరుస్తానన్నాడు.

| | | |
|---|---|---|
| 5.సుందరకాండము | 68 సర్గలు | •హనుమంతుడు సాగరమును లంఘించుట<br>•సీతాన్వేషణము • లంకాదహనం<br>•సీత జాడను రామునికి తెలియజెప్పుట |

**⌘ హనుమంతుని సాగరతీరం - లంకా నగర ప్రవేశం**

- హనుమంతుడు సీతాన్వేషణకై సాగరం పైనుండి ఎగురుతూ ముందుకు వెళుతున్నాడు. రామ కార్యానికి సహాయపడదలచి దారిలో మైనాకుడనే పర్వతం తనపై విశ్రాంతి తీసుకోమని కోరాడు. దాన్ని వినయంతో తిరస్కరించిన హనుమంతుడు ముందుకు సాగాడు.
- సురస అనే నాగమాత హనుమను పరీక్షించదలచి మృత్సగహ్వారం లాంటి తన నోరు తెరిచి అతని దారికి అడ్డు నిలిచింది. యుక్తిగా ఆమె నోట ప్రవేశించి మళ్ళీ బయటకు వచ్చి ఆమె ఆశీర్వచనం పొంది హనుమంతుడు ముందుకు సాగాడు. సింహికి అనే ఛాయాగ్రాహిక రాక్షసి హనుమంతున్ని నీడను పట్టి లాగసాగింది. హనుమంతుడు శరవేగంతో దూరి, కడుపును చీల్చి వేసి త్రికూటగిరి శిఖరంపై వాలాడు.
- మొత్తానికి హనుమంతుడు సాగరమును దాటి లంకానగరంలోకి ప్రవేశించాడు. చిన్నపాటి దేహం ధరించి నగరంలో ప్రవేశించబోయాడు. ద్వారం వద్ద లంకానగరాధి దేవత లంకిణి అతడ్ని అడ్డగించింది. ఆమెను హనుమంతుడు దండించాడు. ద్వారం గుండా కాకుండా ప్రాకారం పైనుండి లంకపై లంఘించాడు.
- రావణ మందిరములోనూ, పానశాలలోనూ, పుష్పక విమానాలలోను, సీతను వెదికాడు. సీతమ్మ జాడ కానక చింతించాడు.

**⌘ అశోకవనంలో సీతమ్మ దర్శనం, త్రిజట స్వప్నం**

- అశోకవనం అత్యంత సుందరంగా ఉన్నది. అక్కడ ఒక శింశుపా వృక్షాన్ని ఎక్కి హనుమంతుడు చుట్టుప్రక్కల పరిశీలింపసాగాడు. అక్కడ శింశుపా వృక్షము క్రింద రాక్షసకాంతలచే పీడింపబడుతూ ఉన్న ఒక స్త్రీని చూశాడు. ఆమె స్థితిగతులు, వేషధారణను బట్టి ఆమెయే సీత అని నిర్ధారించుకొన్నాడు.
- అక్కడికి కామాతురుడైన రావణుడు సీతను బెదిరించి తనకు వశము వస్తువులు కావాలని ఆదేశిస్తూ ఉండగా, సీతా రావణుణ్ణి ధర్మ హీనతను, బీరత్వాన్ని నిందించింది. రావణుడి

బెదిరింపులకు భయవిహల్వమై ఆశను కోల్పోయిన సీత ప్రాణత్యాగం చేయాలని నిశ్చయించుకుంది.

- త్రిజట అనే రాక్షస కాంత మిగిలిన రాక్షస స్త్రీలను గద్దించి సీతవంటి పుణ్య స్త్రీకి హాని చేయటం వల్ల రాక్షస జాతికి వినాశకరమని హెచ్చరించింది. తనకు వచ్చిన కల చెప్పింది. అందులో రామలక్ష్మణులు హంసల పల్లకిలో తీసుకునివెడునట్లు, రావణుడి పరాభవపడ్డాడు. లంకధ్వంసమైంది, రాక్షస స్త్రీలంతా తైలము తాగుతూ పిచ్చివారివలె లంకలో గంతులు వేయుచున్నారు. ఇలా చెప్పిన త్రిజట, తమను ఆపదనుండి కాపాడమని సీతాదేవిని వేడుకోమనీ తక్కిన రాక్షస కాంతలకు హితవు పలికింది.

⌘ **శ్రీరామవర్ణన, రాక్షసులను దండించటం**

- చెట్టుపై నుండి ఇదంతా గమనించిన హనుమంతుడు. ఇంక ఆలస్యం చేయకుండా సీతకు విషయం చెప్పాలి అని, ఒక్కమారుగా కనిపిస్తే ఆమె కంగారుపడి కేకలు వేయవచ్చును. చెట్టుపై నుండీ రామకథ చెప్పటం ప్రారంభించాడు. కథాక్రమంలో తనగురించి కూడా చెప్పాడు హనుమంతుడు.
- ఆ కథ విని సీత సంతోషించింది. అయితే భ్రమ ఏమోనని కంగారు పడింది. అయితే ఆమె ఎదుటకు వెళ్ళిన హనుమ తన గురించి, రాముని పరాక్రమం, అతని దుఃఖం గురించి వివరించి, ఆమెకు త్వరలోనే విముక్తి కలుగుతుందని అనునయ వచనాలు పలికాడు.
- అప్పుడు సీత రాముడ్ని వర్ణించమంది. అప్పుడు హనుమ రాముని సౌందర్యం, బాణబలం, తేజోగుణం, సంపన్నత, జ్ఞానం, వీరత్వం మొ॥నవి అన్నీ వర్ణించాడు.
- శ్రీరాముని గురించి విని సీత ఊరడిల్లింది. తర్వాత హనుమ ఆమెను శ్రీరాముని ఆనవాలైన అంగుళీకమును ఇచ్చాడు. తనతో వస్తే తాను తీసుకెళ్తానని చెప్పగా, అందుకు సీత రాముడే స్వయంగా వచ్చి రావణుడ్ని హతమార్చి నన్ను తీసుకుని వెళ్ళాలని కోరింది.
- సీతాదర్శనంతో సంతుష్టుడైన హనుమ ఇక రావణుడ్ని హెచ్చరించాలి. లంకా రక్షణ వ్యవస్థను తెలుసుకోవాలని నిశ్చయిచాడు. లంకకు వలయునంత నష్టం చెయ్యాలనుకున్నాడు.
- హనుమను గురించి తెలుసుకున్న రావణుడు జంబుమాలిని పంపాడు. హనుమంతుని చేతి పరపుతో జంబుమాలి శరీరం చూర్ణమయ్యింది. హనుమంతుడు భయంకరంగా గర్జిస్తూ అనేకమంది రాక్షసులను సంహరించాడు.

- ఇక దుర్ధరమైన ప్రతాపశాలి. వరసంప్పుడు గొప్ప రధము కలవాడైన అక్షయకుమారుడు సకలబలంతో హనుమంతుడ్ని సమీపించాడు. వారిరువురిమధ్య యుద్ధం భీకరంగా సాగింది. వర్షంలాటి అక్షయకుమారుని బాణాలు హనుమంతునికి చాలా నొప్పిని కల్గించాయి. అయితే అతడి పరాక్రమానికి ముచ్చటపడిన అతడ్ని ఉపేక్షిస్తే ప్రమాదమని భావించి హనుమంతుడు విజృంభించి అక్షయకుమారుడి శరీరాన్ని గిరగిరా తిప్పి నేలకు విసిరికొట్టాడు. అతడి శరీరం నుగ్గునుగ్గయ్యింది.
- ఈ సంగతి తెలిసిన రావణుడు కలవరపడి పెక్కు జాగ్రత్తలు చెప్పి ఇంద్రజిత్తును యుద్ధానికి పంపాడు. ఇతడు పరాక్రమశాలి. మంత్ర, తంత్రయుద్ధవిద్యానిపుణుడు. హనుమ, ఇంద్రజిత్తుల మధ్య యుద్ధం చిత్రవిచిత్ర రీతుల్లో జరిగింది. ఒకరిని ఒకరు జయించడం అశక్యమని ఇద్దరికీ తెలిసిపోయింది.
- చివరికి ఇంద్రజిత్తు ప్రయోగించిన 'బ్రహ్మాస్త్రం' హనుమంతుడ్ని బంధించింది. బ్రహ్మ హనుమంతుడికిచ్చిన వరం ప్రకారం ఆ అస్త్రం అతడ్ని భాదించకుండా మరుక్షణమే తొలగిపోయింది. అయినా బ్రహ్మదేవుడిపట్ల గౌరవసూచకంగా ఆ అస్త్రానికి కట్టుబడిపోయినట్లుగా నటించాడు.

**⌘ రావణునితో సంవాదం, లంకాదహనం**

- హనుమంతుడు రావణుడి సభా మండపంలో ప్రవేశించాడు. మణిమాయాలంకృతమైన ఉన్నతాసనంపై కూర్చుని ఉన్న రావణుడి రూపం, దర్పం, అత్యద్భుతం అని హనుమ అనకున్నాడు.
- హనుమరావణుడితో ఇలా అన్నాడు. ''నేను సుగ్రీవుడి మంత్రిని, రామదాతను హనుమంతుడనే వానరుడను. రాముని పత్ని సీతని తెచ్చి నువ్వు పెద్ద తప్పిదం చేశావు, దీనివల్ల నీవు చేసుకున్న పుణ్యమంతా నిష్ఫలమైపోతుంది. నామాటవిని సీతను అప్పగించి రామున్ని శరణువేడుకో. రాముని క్రోధానికి గురియైనవానిని ముల్లోకాలలో ఎవరూ రక్షింపజాలరు'' అని హితవు చెప్పాడు.
- రావణుడు కోపించి ఆ వానరుణ్ని చంపమని ఆదేశించాడు. అంతలో విభీషణుడు అడ్డుపడి దూతను చంపడం రాజధర్మంకాదు, దండించి వదలమని సూచించాడు. దాంతో నెమ్మదించిన రావణుడు ఆ వానరుని తోకకు నిప్పంటించి వూరంతా త్రిప్పమని ఆదేశించాడు.

- రాక్షస కింకరులు హనుమంతుని తోకకు పాతగుడ్డలు చుట్టి నిప్పు పెట్టారు. ఊరంతా త్రిప్పసాగారు. జరిగిన సంగతి తెలిసిన సీతాదేవి, హనుమంతుడ్ని చల్లగా చూడమని అగ్నిదేవుడ్ని ప్రార్థించింది. తన తోక కాలుతున్నా ఏమాత్రం బాధలేకపోవటానికి కారణం సీతామహిమ, మరియు తన తండ్రి వాయుదేవుడుకు అగ్ని మిత్రుడుకావటం వల్లేనని హనుమకు అర్థమయ్యింది. ఇక ఆ అగ్నికి లంకను ఆహుతినీయ సంకల్పించాడు.
- రాక్షసమూకను చితకబాది, ప్రహస్తుని ఇంటితో మొదలు పెట్టి లంకలోని అద్భుత భవనములకు నిప్పంటించాడు. ఒక విభీషణుడి ఇల్లు తప్ప లంకలోని భవనాలను బుగ్గిచేసాడు.
- ఆ సమయంలో సీతకు ఏమయినా అవుతుందేమోనని బాధపడ్డాడు. తన తొందరపాటును తప్పుబట్టుకున్నాడు. అయితే సీత క్షేమమని తెలిసి ఊరట చెందాడు. మరోసారి సీతను కలిసి ఆమెకు అభయమిచ్చి ఉత్తరదిశగా బయలుదేరాడు.

⌘ **తిరుగులంఘనం, రామునికి సీత జాడ చెప్పుట**

- హనుమంతుడు మొత్తానికి సముద్రందాటి మహేంద్రగిరిపై దిగి గురువులకు ప్రణామం చేశాడు. కనుగొంటిని సీతమ్మను, ఆమెరాక్షసుల బందీయై రాముని కొరకు ఎదురుచూచుచు కృశించియున్నది అని హనుమంతుడు చెప్పాడు. ఈ మాట వానరులకు ఆనందంకల్గించింది.(సీతజాడ)
- ఇక అంతా కలసి వెళ్ళి లంకను నాశనం చేసి రావణుడ్ని ఓడించి సీతను తెచ్చి రామునకు అప్పగించాలని అంగుదుడు అభిప్రాయ పడ్డాడు.
- సీత జాడ తెలియడం వల్ల అంగదాది వానరులంతా కిష్కింధకు బయలుదేరారు. దారిలో మధువనమనే మనోహరమైన వనాన్ని చేరుకున్నారు. అది సుగ్రీవునిది, దదిముఖుడనే వృద్ధవానరవీరుని పరిరక్షణలో ఉంది. అయితే వానరులు అంగదుని అనుమతి లేకుండా ఫలాలుకోసుకుని తింటూ, మధువులను గ్రోలుతూ, చిందులేస్తూ వనాన్ని ద్వంసం చేశారు. ఈ వార్త దధిముఖుడు సుగ్రీవునికి చేరవేసారు.
- సీత జాడ తెలియటంవల్లనే వానరులు ఇలా చేసి ఉంటారని సుగ్రీవుడు ఊహించాడు. ఇద ఇలా ఉండగాఅంగదాది ప్రముఖులు, హనుమంతుడు ఉత్సాహంతో ప్రసన్నగిరిపై దిగారు. హనుమంతుడు 'దృష్టాదేవి' (చూచానుసీతను) అని చెప్పగానే రామలక్ష్మణులు

హమదానంద భరితులయ్యారు. జరిగినదంతా (సీత దీనస్థితి) హనుమ రామలక్ష్మణులకు వివరించాడు.

- గుంటూరు శేషేంద్రశర్మగారు తన ''షోడశిరామాయణచరిత్ర''లో ఇలా అన్నారు. సుందరకాండలో హనుమంతుని 'కుండలినియోగసాధన' నిక్షిప్తమై ఉన్నదన్నారు.
- ఆంధ్రవాల్మీకి వావిలకొలను సుబ్బారావుగారు తన 'మందరం' అనే రామాయణంలో సుందరకాండను గురించి ఇలా అన్నారు.
- వ్యాధులు, కారగృహబంధనములు, గ్రహపీడలు, అనపత్యలీలు, దారిద్ర్యం, సంకటాలు అన్నియు సుందరకాండ పారాయణం వల్ల తొలగిపోతాయి అని అన్నాడు.

| | | |
|---|---|---|
| 6.యుద్ధకాండము | 13 సర్గలు | •సాగరమునకు వారధి నిర్మించుట •యుద్ధము, •రావణసంహారం,•సీత అగ్నిప్రవేశం, •అయోధ్యరాక, పట్టాభిషేకము |

- హనుమంతుడు రాముడితో సీత జాడచెప్పి ఒక నెలలోపు రాముడ్ని చూడకున్నా తాను బ్రతకనని సీత చెప్పింది అనికూడా హనుమచెప్పాడు.
- యుద్ధానికి సిద్ధం, విభీషణి శరణాగతి – హనుమంతుడు చేసిన మహోపకారానికి ముగ్దుడైన రాముడు, హనుమంతుడ్ని కీర్తించి గాఢలింగనము చేసుకున్నాడు.
- సరైన సమయము చూసి నలుని నాయకత్వంలో బ్రహ్మాండమైన కపిసేన కోలాహలంగా దక్షిణమునకు పయనమైంది. హనుమంతుని భుజాలపై రాముడు, అంగదుని భుజాలపై లక్ష్మణుడు అధిరోహించారు.
- లంకలో రావణుడు యుద్ధవిషయమై తనవారితో యంత్రాం నెరపసాగాడు. పురభద్రత కట్టుదిట్టంగా ఉండాలని ఆనతిచ్చాడు. అయితే రావణుడి తమ్ముడైన విభీషణుడికి రామలక్ష్మణులతో యుద్ధం నచ్చి లేదా, రామలక్ష్మణుల క్రోధాగ్నికి లంక భస్మమవ్వం తథ్యమని రావణుడు అనాలోచితంగా సీత అనే కాలనాగును తన మెడకు చుట్టుకున్నాడని నచ్చజెప్పడానికి యత్నించాడు.
- మరునాడు రావణుడు మంత్రిగృహంలో కొలువుదీరినప్పుడు కుంభకర్ణుడు రావణుడు పొరపాటు చేశాడని అని అన్నాడు. అయితే తాను విజృంభించి రావణుని కార్యం సిద్ధింపజేస్తానని అని కూడా పలికాడు. మళ్ళీ విభీషణుడు హితవు చెప్పబోగా ఇంద్రజిత్తు, రావణుడు అతన్ని నిందించాడు.

- అన్నగారి దగ్గర సెలవు తీసుకుని విభీషణుడు సాగరమును దాటి రాముడ్ని శరణుకోరాడు. అతనిని నమ్మవద్దని కపిలవీరులన్నారు. అయితే అతడు నమ్మదగినవాడని హనుమంతుడు రామునికి చెప్పాడు.

⌘ **సాగరంపై వారధి**

- తమ మధ్యవైరం ఏమిలేదు గనుక రామునికి సాయం చేయవద్దని రావణుడు సుగ్రీవునికి శకుడనే దూత ద్వారా దౌత్యం పంపాడు. కాని దాన్ని సుగ్రీవుడు మన్నించలేదు.
- సముద్రకెరటాలు ఆగటానికి సముద్రుడిని సాయం కోరమని రామునికి విభీషణుడు సలహా ఇచ్చాడు. 3 రాత్రులు నియమంగా దీక్షవహించినా సముద్రుడు ప్రత్యక్షం కాలేదు. దీనితో రాముడికి కోపం వచ్చి సముద్రుడిని ఎండగట్టేస్తానని బాణం తీశాడు. దానికి భయపడిన సముద్రుడు ప్రత్యక్షమై వినయంగా నమస్కరించి తన ప్రవర్తనను మన్నించమన్నాడు.
- విశ్వకర్మ కొడుకైన నలుని ప్రజ్ఞలో వారధిని నిర్మింపవచ్చునని తెలిపాడు. సముద్రునికోరికపై రాముడు తన అస్త్రాన్ని ద్రుమకుల్యంలోని దస్యులపై విడిచిపెట్టాడు.
- ఇకసాగరమును దాటుటకు అద్భుతమైన వారధి నిర్మాణం నలుని పర్యవేక్షణలో ప్రారంభమైంది. మొత్తం 5 రోజుల్లో 100 యోజనముల పొడవు, 10 యోజనముల వెడల్పుగల వారధిని నిర్మించారు.
- విభీషణుడు ఒక ప్రక్కవారధిని రక్షణగా నిలిచాడు. వానర భల్లూక సేనలు, రామలక్ష్మణులు వారధిని దాటి లంకను చేరారు.
- త్రికుట పర్వతంపైన లంకాపట్టణం సంకల్పమాత్రాన విశ్వకర్మ నిర్మించినట్లు వైభవంగా ఉంది. రామునకు యుద్ధం ఘోరంగా తీవ్రంగా జరుగుతుంది అన్న శకునం అర్థమైంది, తమ దగ్గర బందీగా ఉన్న శకుడు అనేదూతను విడుదల చేయించాడు.
- శకుడు రావణుడ్ని హెచ్చరించి యుద్ధం వద్దన్నాడు. రామలక్ష్మణులు, వానరులు అంతబలంగా ఉన్నారన్నాడు. రావణుడు పంపిన మరొకచారుడు శార్దూలుడు కూడా ఇదే విషయాన్ని ధృవీకరించాడు.

⌘ **యుద్ధానికి ముందు**

- రావణుడు విద్యుజ్జిహ్వుడనే మాయలమారి రాక్షసుని పిలిపించి రాముని శిరస్సును పోలిన ఒక మాయా శిరస్సును, ధనుర్బాణాలను చేయించాడు. యుద్ధంలో రామలక్ష్మణులు, వానర సైన్యం నశించారని సీతతో చెప్పి ఆ మాయాశిరస్సును, ధనుర్బాణాలను చూపాడు.

సీత కన్నీరు మున్నీరుగా విలపించసాగింది. రావణుడు వెళ్ళిపోయాక విభీషణుని భార్య సరయ అనే సాధ్వి సీతను ఓదార్చి అదిమాయ అని రహస్యంగా తాను అంతా విన్నానని చెప్పింది.

- యుద్ధానికి భల్లూకవానర సమేతంగా రాముడు సిద్ధంగా ఉన్నాడని సీతకు శుభసౌభాగ్య సమయం ఆసన్నమైందిని అనునయించింది.
- రావణుని తల్లికి పినతండ్రి అయిన మాల్యవంతుడునే వృద్ధుడు రావణునికి యుద్ధం మానమని హితవుపలికాడు. అతడ్ని రావణుడు కఠినంగా దూషించాడు.
- రావణుడు, రాముడు అన్నివైపులనుండి తమ సేనా నాయకులతో యుద్ధానికి సిద్ధమయ్యారు. ఇది ఇలా ఉండగా రాముడు అంగదుడ్ని దూతగా రావణుని వద్దకు పంపాడు. సీతనిచ్చి శరణు కోరతే రాముడు క్షమించి వదిలివేస్తాడని చెప్పాడు అంగదుడు. అయితే దాన్ని రావణుడు తృణీకరించాడు.

⌘ **రామలక్ష్మణ సుగ్రీవుకు జయం**

- వానరసేన లంకను ముట్టడించింది, ముందుగా మట్టితోనూ, బండరాళ్ళతోను, చెట్లతోనూ అగడ్తను పూడ్చివేసి ప్రాకారాలు ఆక్రమించారు. ఒక్క క్షణంలో యుద్ధం భీకరం అయ్యి భూమి అంతా రక్తమాంసాలతో నిండిపోయింది.
- వానర రాక్షసుల మధ్య ద్వంద్వయుద్ధాలు ఆరంభమయ్యాయి. అంగదుడు ఇంద్రజిత్తుతోనూ, సంపాతి ప్రజంఘునితోనూ హనుమంతుడు జంబూలితోనూ, నీలుడు నికుంభునితోనూ, సుగ్రీవుడు ప్రఘునునితోనూ, లక్ష్మణుడు విరూపాక్షునితోనూ తలపడ్డారు.

⌘ **నాగపాశ విమోచన**

- అంగదుని చేత పరాభవం పొందిన ఇంద్రజిత్తు ఒక్కసారిగా మాయమైపోయాడు. మాయా యుద్ధాన్ని ఆరంభించి నాగాస్త్రంతో రామలక్ష్మణులను నివశులను చేసి శతృసైన్యాన్ని భయకంపితులను చేశాడు. రామలక్ష్మణుల దేహంపై ప్రతి అంగుళం బాణాలతో నిండిపోయింది. వానరసేన సిగ్గువిడిచి పరుగులు తీసింది.
- ఇంతలో గరుత్మంతుడు వహ్రప్రభంజనంలా వచ్చాడు. అతని రాకతో శరరూపంలో రామలక్ష్మణులను పట్టుకుని ఉన్న సర్పాలన్నీ పారిపోయాయి. గరుత్మంతుడి స్పర్శతో రామలక్ష్మణులు యొక్కగాయాలు మాయమై మునుపటి తేజస్సువచ్చింది.

⌘ **రాక్షసవీరుల మరణం**

- ఈ యుద్ధంలో రాక్షసులైన 'ధూమ్రాక్షుడు'(హనుమచేతిలో), 'వజ్రదష్ట్రుడు' (అంగదునిచేతిలో), ప్రహస్తుడు (నలునిచేతిలో) మరణించారు. రావణునికి ఇదిచాలా పెద్ద నష్టం.
- ఇక లాభం లేదనుకుని రావణుడు స్వయంగా మహావీరులైన రాక్షస గణాలను వెంటబెట్టుకుని దివ్యరథంపై యుద్ధానికి వెడలాడు. రావణుడు ప్రచండ భానుడిలా మెరిసిపోతున్నాడు. సీతను అపహరించిన పాపానికి రావణునికి అంత్యకాలం సమీపించిందని చెబుతూ రాముడు ధనస్సు ఎక్కుపెట్టాడు.
- రావణుడు కాలనాగులులాంటి తన బాణాలతో వానర సైన్యాన్ని చిందర వందర చేయసాగాడు. సుగ్రీవుడు మూర్చపోయాడు. గవాక్షుడు, ఋషభుడు, గవముడు, నలుడు, జ్యోతిర్యాఖుడు వేసిన పర్వత శిఖరాలను రావణుడు పిండి పిండి చేశాడు.
- హనుమంతుని అరచేతి దెబ్బకు రావణుడు, రావణుడి పిడికిలి పోతుకు హనుమంతుడు కంపించిపోయారు. లక్ష్మణుడి బాగాలకు రావణుని ధనస్సు విరిగిపోయింది.

**⌘ కుంభకర్ణుడు, ఇతర రాక్షసవీరులు మరణం**

- అవమాన భారంతో కృంగిన రావణుడు తనసోదరుడైన కుంభకర్ణుడిని నిదురలేపమని మంత్రులను పంపాడు. వారు భేరిభీంకారాలు చేసి శూలాలతో పొడిచి, ముసలాలతో మోది, ఏనుగులతో త్రొక్కించి కుంభకర్ణుడిని నిద్రలేపారు.
- రావణుడు కుంభకర్ణుడికి జరిగినదంతా చెప్పాడు. సోదరుణ్ని కుంబకర్ణుడు విమర్శించినప్పటికీ సోదరప్రేమతో యుద్ధంలో పాల్గొంటానని చెప్పాడు. రామలక్ష్మణులను, సకల వానరసేన భక్షించి పరిస్థితిని చక్కదిద్దుతానని మాట ఇచ్చాడు. యుద్ధంలోకి వెళ్ళిన కుంభకర్ణుడు 600 ధనస్సుల ఎత్తు, 100 అడుగుల వెడల్పు ఉండి మహాకామునిలా నడుస్తుంటే వానరసేనలు పారిపోసాగాయి. అయితే వీరికి ధైర్యం చెప్పి అంగదుడు ఆపగలిగాడు.
- కుంభకర్ణుడు వందలాది వానరులను కరకర నమిలి మింగాడు. కుంభకర్ణుడి శూలం పోటుకు హనుమంతుడు రక్తం కక్కాడు. చివరికి రామలక్ష్మణుల బాణాలు కుంభకర్ణుడిని ఇబ్బందిపెట్టాయి. రాముడు వాయువ్యాస్త్రంతోనూ, ఇంద్రాస్త్రంతోనూ వాడి చేతులు, తొడలు నరికేశాడు.

- ఇంకా ఈ యుద్ధంలో రాక్షస వీరులైన నరాంకితుడు, త్రిశురుడు, మహోదరుడు అతి కాముడు వంటి వీరుడిగా మరణించారు.

⌘ **హనుమ ఓషది పర్వతాన్ని తెచ్చుట, రామరావణుల యుద్ధం**

- పుత్రుల, సోదరుల మరణానికి చింతాక్రాంతుడైయున్న రావణునికి ధైర్యం చెప్పి ఇంద్రజిత్తు యుద్ధరంగానికి వెళ్ళాడు. అదృశ్యరూపంలో వానర సైన్యం పైకి విరుచుకుపడ్డాడు. బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించిన చాలామంది మూర్ఛిల్లేలాచేశాడు.
- ఇలాంటి పరిస్థితుల్లో జాంబవంతుడు హనుమంతుడ్ని హిమాలయపర్వతం మధ్యలో ఉన్న ఓషది పర్వతం మీది మృత సంజీవిని మరియు ఇతర ఔషదాలను తీసుకురమ్మని చెప్పాడు. దాంతో హనుమ ఓషది పర్వతంపై మూలికలను వెదికాడు. అవి కనబడక పోవటంచే పర్వతంనే ఎత్తుకుని యుద్ధభూమికి వచ్చాడు. రామలక్ష్మణులు, వానరులు అంతా స్పృహలోకి వచ్చారు.
- యుద్ధంలో కుంభకర్ణుని కుమారులైన కుంభుడు, నికుంభుడు  కూడా మరణించారు. మకి రాక్షసుడు మరణించాడు. ఇక ఇంద్రజిత్తు రంగంలోకి దిగాడు. అతన్ని ఈ యాగానికి నికుంభులను వెళ్లకుండా ఎవరు ఆపగలరో వారి చేతిలోనే ఇంద్రజిత్తు చావు రాసిపెట్టి ఉందని విభీషణుడు చెప్పాడు. లక్ష్మణుడు(సౌమిత్రి) వేసిన ''మహేశ్వరాస్త్రం'' కు ఇంద్రజిత్తు తల తెగిపడింది.
- ఇంద్రజిత్తు మరణంతో రావణుడు తెలివి తప్పి పడిపోయాడు. కోపంతో సీతను చంప బోయాడు. సుపార్శ్వుడనే  బుద్ధిమంతుడైన అమాత్యుడు అతణ్ని వారించి వీరోచితంగా యుద్ధంచేసి విజయుడవు కమ్మని చెప్పాడు.
- రావణుని మహోగ్రమైన దాడికి వానరసైన్యం చిన్నాభిన్నమైంది. రావణుడు రాముని పైకి ఉరికాడు. విరూపాక్షుడు వానరులను వానరులను నాశనం చేశాడు. అయితే సుగ్రీవుని చేతిలో విరూపాక్షుడు మరణించాడు. అటు పిమ్మట సుగ్రీవుడు మల్లయుద్ధంలో మహోదరుని తుదముట్టించాడు. అంగదుడి దెబ్బకు మహాపార్శ్వుడు  మరణించాడు.

⌘ **లక్ష్మణుని మూర్ఛ, రావణుని సంహారం**

- రావణుడు తన వాడి బాణాలతో రామలక్ష్మణాదులను వేధించసాగాడు. అయినప్పటికీ వాటిని లక్ష్మణుడు, విభీషణుడు ఎదిరించాడు. రావణుడు విసిరేసిన శక్తి వక్షస్థలానికి తగిలి లక్ష్మణుడు మూర్ఛపోయాడు. సోదరుని అవస్థకు పరితపిస్తూనే ప్రళయాగ్నిలా

రాముడు రావణునిపై బాణవర్షం కురిపించసాగాడు. కొంతసేపటికి రావణుని శక్తి లక్ష్మణుడ్ని విడిచి పెట్టింది.

- ఇంతలో రాముడు తన సత్తా చూపించేలా చెలరేగిపోయాడు. రామరావణ సంగ్రామం భీకరంగా సాగింది. కొంతసేపటికి మేఘంలోకి దూరి రావణుడు మాయమైనాడు. అయితే యుద్ధభూమిలో అచేతనంగా పడిఉన్న లక్ష్మణుడ్ని చూసి రాముడు విలపించసాగాడు. అప్పుడు సుషేణుడు సలహాతో మరలా హనుమ ఔషధీ పర్వతాన్ని తీసుకువచ్చాడు. మూలిక రసం నాలికపై వేయగానే లక్ష్మణుడు లేచి రాముడ్ని కౌగిలించుకున్నాడు.
- అదే సమయంలో ఇంద్రుడు పంపగా మాతలి దివ్యమైన రథంతో సారథిగా వచ్చాడు. రాముడు సంతోషించి ప్రదక్షిణలు చేసి రథం ఎక్కాడు. ఇక రాముడు విడిచిన బాణాలతో రావణుని శరీరం రక్తసిక్తమైంది. ఆ సమయంలో అగస్త్యుడు అక్కడికి వచ్చి యుద్ధపరిశ్రాంతుడై ఉన్న రామునకు సనాతనము, పరమ రహస్యము అయిన 'ఆదిత్య హృదయమును ఉపదేశించాడు ఇది సూర్య మంత్ర శ్లోకము జయ మైనది రాముడు ముమ్మారు ఆదిత్య హృదయం జ్యోతిర్ గానిది పతి అయిన సూర్యునికి నమస్కరించి రావణ సంహారానికి పూనుకున్నాడు మహా సర్ప లాంటి రాముని బాణాలకు రావణుని తలలు తెగి పడింది అయితే వెంటనే మరొకటిగా అమలు చేస్తున్నాయి ఇలా note అక్క సార్లు జరిగింది రామా ఇలా కాదుబ్రహ్మాస్త్రాన్ని సంధించు సంధించు అని మాతలి అన్నాడు అప్పుడు రాముడు తనకు అగస్త్యుడు ఇచ్చిన బ్రహ్మాస్త్రాన్ని నమస్కరించి సంధించాడు అది నిప్పులు చిమ్ముతూ రావణుని గుండెను చీల్చి రావణుడు నేలకొరిగాడు సకలదేవతలు రామునకు అంజలి ఘటించారు సుగ్రీవ విభీషణ అంగద హనుమ లక్ష్మణులు విజయోత్సాహంతో మునిగారు

⌘ **సీత అగ్నిప్రవేశం**

- రావణుడు మరణించాక రాముని ఆనతిపై విభీషణుడు రావణునికి అంత్యక్రియలు చేశాడు. పిదప విభీషణుడు పట్టాభిషిక్తుడయ్యాడు. విభీషణుని అనుజ్ఞతో హనుమ లంక లోకి వెళ్లి విజయవార్తను సీతకు నివేదించాడు. అంతఃపుర పరివారం మంగళ స్నానం చేయించి సీతను రాముని వద్దకు తీసుకువచ్చారు.
- రాముడు సీతను చూసి ఇలా అన్నాడు. ఇక్ష్వాకుల ప్రతిష్ట కోసం నేనీ యుద్ధం చేశాను. రావణుడు నిన్ను దుష్ట దృష్టితో చూశాడు. కనుక నేను నిన్ను స్వీకరించ లేను అని చెప్పి

నువ్వు ఎక్కడికైనా స్వేచ్ఛగా వెళ్ళవచ్చు అని పలికాడు. అప్పుడు సీత దుఃఖంతో బావురుమంది. రావణుడు నన్ను ఆవిధంగా చూసిన తప్పు నాదికాదు. దైవానిది. నా హృదయం నీమీదే లగ్నమయ్యిఉన్నది అని అన్నది.

- సీత లక్ష్మణునివైపు తిరిగి లక్ష్మణా కళంకిని అనిపించుకుని నేనింక బ్రతకలేను. నా సుగుణాలని కీర్తించని నాభర్త నలుగురి ముందు నన్ను అనరానిమాటలన్నాడు. అగ్నిని ప్రజ్వలింపజేయి అని అన్నది. అందరికి నమస్కరించి, అటుపిమ్మట అగ్ని దేవునితో ''నా హృదయం సదా రామచంద్రుడినే పూజిస్తున్నట్లయితే సర్వభక్షకుడైన అగ్ని నన్ను పునీతురాలిని చెయ్యాలి అని పలికి మంటల్లోకి నడిచింది.
- బ్రహ్మ, అగ్నిలు 'సీతను' స్వీకరించమని రామునికి చెప్పాడు. అప్పుడు రాముడు ఇలా అన్నాడు. సీత పరమ పవిత్రురాలని నెనెరుగుదును. అయితే కామం వల్లే నేను సీతని మరలా చేపట్టాను అని లోకం నన్నుఅనకూడదు, ఇక్ష్వాకువంశానికి మచ్చరాకూడదు అని సీత పవిత్రత లోకానికి తెలియాలనే అగ్ని ప్రవేశాన్ని మౌనంగా భరించానన్నాడు. తర్వాత దక్షిణ హస్తాన్ని చాచి సీతను చేతినందుకున్నాడు.

**⌘ అయోధ్యకు పునరాగమనం, శ్రీరామపట్టాభిషేకం**

- రామునికోరికపై ఇంద్రుడు చనిపోయిన వానరవీరులందరిని బ్రతికించాడు. సైన్యమంతా సంబరాల్లో మునిగిపోయింది. విభీషణుడు, వానరులు తోడురాగా పుష్పక విమానంపై సీతారామలక్ష్మణులు అయోధ్యకు తిరుగు ప్రయాణమయ్యారు.
- ముందుగా హనుమంతుడు నంది గ్రామం చేరుకుని హనుమంతుడు భరతునికి సీతారామలక్ష్మణుల పునరాగమన సందేశాన్ని అందించాడు. రాముని పాదుకలు నెత్తిపై పెట్టుకుని పరివార సహితుడై ఎదురేగి రామ, సీతాలక్ష్మణులకు ప్రణమిల్లాడు.
- శ్రీరామ పట్టాభిషేకానికి ముహూర్తం నిశ్చయమయ్యింది. సుగ్రీవాజ్ఞతో పనులు చకాచకా జరిగాయి. వశిష్ట మహర్షి ఋత్వికులతో కలసి సీతారాములను రత్న సింహాసనంపై కూర్చుండబెట్టారు.
- రాముడు అందరికి దాన ధర్మాలు చేశాడు. సీతకు ముత్యాల హారాన్ని ఇచ్చాడు. అయితే ఆమె దాన్ని తనకు మిక్కిలి ఆనందాన్ని కారణమైన హనుమకు ఆ దండ(హారం) ఇచ్చింది. లక్ష్మణుడు యువరాజుగా ఉండటానికి ఇష్టపడలేదు. దీంతో రాముడు భరతుడ్ని

యువరాజుగా నియమించాడు. శ్రీరాముని రాజ్యంలో జనులు సుఖసంతోషాలతో జీవించారు.

| | | |
|---|---|---|
| 7.**ఉత్తరకాండము/ ఉత్తర రామాయణము** | సర్గలు | •సీత అడవులకు పంపబడుట, •కుశలవుల వృత్తాంతం, •సీత భూమిలో కలియుట, •రామావతార సమాప్తి |

- రాముడి జననం నుండి పట్టాభిషేకం దాకా జరిగిన కథ అసలు రామాయణంగా లేదా మొదటి భాగంగా చెప్పవచ్చును.
- శ్రీరాముని పట్టాభిషేకం నుండి నిర్యాణం దాకా జరిగిన కథను రెండో భాగంగా లేదా ఉత్తర రామాయణంగా పిలుస్తారు. ఇది వాల్మీకి రచించలేదని తర్వాత జతపడిందిఅని అంటారు.
- ఈ ఉత్తర రామాయణాన్ని సంస్కృతంలో ''భవభూతి'' రచించాడు. (ఉత్తర రామచరితం అనే పేరుతో) ''ఏకోరస కరుణ'' అనే స్లోకంతో ఈ ఉత్తర రామచరితం మొదలయ్యింది.
- దీన్నే తిక్కన సోమయాజి నిర్వచనోత్తర రామాయణంగా కంకంటి పాపరాజు 'చంపూ' కావ్యంగా రచించాడు.

**⌘ రామరాజ్యం, సీతపై నింద**

- శ్రీరామ పట్టాభిషేకం తర్వాత అయోధ్య అంతటా సుఖసంతోషాలు వెల్లివిరిసాయి. శ్రీరామునిపాలనలో ప్రజలు ఏ కష్టం లేకుండా సుఖంగా జీవించారు.
- ఇది ఇలా ఉండగా సీతను రాముడు నువ్వు తల్లివి కాబోతున్నావు. నీకేమైన కోరికలుంటే కోరు అని అంటారు. అందుకు ఆమె గంగాతీరంలో ఉన్న ముని ఆశ్రమంలో పళ్ళు, కందమూలాలు ఆరగిస్తూ ఒకరోజు గడపాలని ఉంది అని అంటుంది.
- ఇది ఇలా ఉండగా తన పరిపాలనను గురించి సత్యాలు చెప్పమని భద్రుడిని రాముడడుగుతాడు. అంతా బాగానే ఉంది. కానీ రావణుని చెరలో ఉన్న సీతను నువ్వు ఏలుకోవటం గురించి ప్రజలు రకరకాల వ్యాఖ్యానాలు విన్నాడు. దానికి రాముడు చింతిస్తాడు.
- తర్వాత తన సోదరులను పంపించి 'లక్ష్మీదేవి' సూర్యచంద్రులు, అగ్ని, ఇంద్రాదిదేవతలు కూడా సీత సౌశీల్యాన్ని శ్లాఘించారు. కాని ఆమెపై అయోధ్యలో ఇంకా అపవాదు తొలగలేదు.

- ప్రజాభీష్టం లేని పాలన సూర్యుడు లేని పగలు వంటిది. ఇప్పుడు నాకు ఆమెను పరిత్యజించడం తప్ప వేరే మార్గం కనబడటం లేదు. కొద్ది సమయం క్రిందటే సీత తనకు మున్యాశ్రమాలు చూడాలని కోరికగా ఉన్నదని కోరగా అమెకి సరే అని అనుమతిని ఇచ్చాను. నువ్వు మారు మాట్లాడక ఆమెను గంగానది తీరంలోని ఆశ్రమాల వద్ద వదలిరా ఇది నా ఆజ్ఞ అంటాడు.

⌘ **అడవులపాలైన సీత, ముని ఆశ్రమం, కుశలవులు**

- లక్ష్మణుడు మారుమాటడక ఉదయాన్నే రథం సిద్ధం చేయమని మంత్రి సుమంతుడికి చెప్పి సీత వద్దకు వెళ్ళి తల్లి ఆశ్రమంలో గడపాలన్న నీ కోరిక మేరకు నేడు నిన్ను మున్యాశ్రమలకై గంగానది వద్దకు తీసుకువెళ్ళమని అన్న అనుమతిచ్చాడు'' అనగానే సీత సంతోషంగా ప్రయాణమయ్యింది.
- వీరు ప్రయాణించి గంగానదిని దాటి మున్యాశ్రమం దగ్గర, సీతను వదులుతూ లక్ష్మణుడు విలపిస్తూ జరిగినదంతా చెప్పి క్షమించమన్నాడు. అది విన్న సీత మూర్చబోయి, తర్వాత తేరుకుని సౌమిత్రి నేను కష్టాలను అనుభవించడానికే పుట్టాను. పూర్వజన్మపాపం వెంటాడుతున్నది అని మిక్కిలి దుఃఖిస్తూ, ఆయన మాటను గౌరవిస్తాను. నా నమస్కారాలు తెలియజెయ్యిఅని అన్నది. ఆమె పాదాలకు మొక్కి విలపిస్తూ లక్ష్మణుడు తిరుగు ప్రయాణమయ్యాడు.
- ముని బాలకుల ద్వారా సంగతి తెలుసుకున్న వాల్మీకి ఆమెను తన ఆశ్రమానికి తీసుకునివచ్చి, సీతను గురించి వివరాలు చెప్పి, నువ్వు పరమ పవిత్రురాలువు, నేను నాతపశ్శక్తితో సర్వం గ్రహించాను. నీవు నిశ్చింతగా ఉండు. మునిసతులందరూ నిన్ను కన్నకూతురి వలె చూసుకుంటారు అని ఓదారుస్తాడు.
- ఆశ్రమంలోని వారినందరిని పిలచి జానకీదేవికి ఏ కష్టం కలగకుండా చూసుకోమని చెబుతాడు. అక్కడ కొంతకాలానికి జానకిదేవి ఇద్దరు కవల పిల్లలకు (బాలలకు) జన్మనిచ్చింది. వారు లవకుశ నామధేయులై దిన దిన ప్రవర్తమానమవుతూ అటు వేద విద్యలోనూ, ఇటు క్షాత్రవిద్యలోనూ తిరుగులేని బాలురుగా ప్రకాశించారు.

⌘ **అశ్వమేధయాగం**

- రాముడు ఒకనాడు అశ్వమేధ యాగం చేయదలిచాడు. అభిప్రాయం చెప్పమని సోదరులను అడుగగా భరతుడు, లక్ష్మణుడు గట్టిగా సమర్థించారు, పూర్వం ఇంద్రుడు ఈ యాగం చేసి వృతాసుర వధ వల్ల కలిగిన బ్రహ్మహత్యాపాతకాన్ని వదిలించుకున్నాడు.
- దీంతో సుగ్రీవుడు, విభీషణుడు మొదలైన దేశాధిపతులు, మునులు, భటులు, గాలాకులు రాగా నైమిశారణ్యంలో గోమతీ నదీ తీరాన యజ్ఞ వాటికను సమస్త వైభవంగా నిర్మించారు. శ్రేష్టమైన గుర్రాన్ని రాముడు అర్ఘ్యంచి వదిలిపెట్టాడు. రక్షకునిగా లక్ష్మణుడు, ఋత్వజలతో సహా బయలుదేరాడు. తరువాత రాముడు యజ్ఞవాటిక లోకి ప్రవేశించాడు. అప్పుడు భూమండలంపై ఉన్న రాజులందరూ రాముణ్ణి అభినందించి కానుకలు సమర్పించుకోసాగారు.
- ఇలా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏడాది పాటు అశ్వమేధ యాగం కొనసాగింది. వాల్మీకి మహర్షి సైతం శిష్యసమేతంగా వచ్చాడు. లవకుశలను రామాయణంను అన్ని ప్రదేశాల వద్ద గానం చేయమన్నారు.

⌘ **రామాయణ గానం**

- మర్నాటి ఉదయం లవకుశులు వాల్మీకి మునికి నమస్కారం చేసి ఆయన ఆశీర్వాదంతో రామాయణ గానం అయోధ్య నలుదిశలా ఆరంభిస్తారు. జనులు సమ్మోహితం అవుతారు. జనం అంతా దీని గురించే చర్చిస్తారు. రాముడు కూడా ఆగానాన్ని విని ముగ్దుడవుతాడు.
- యజ్ఞకర్మ పూర్తిగా పూర్తికాగానే రాముడు అందరి ప్రముఖులను పిలిపించి, వారి ముందు కుశలవులను గానం చేయమంటాడు.
- భరతుడు వీరికి 18000 బంగారు నాణెములు బహూకరించమనగా, లవకుశలు వాటిని అంగీకరించారు.
- తరువాత రామునికి అర్థం అయ్యింది. గానం చేసింది సీతా పుత్రులులేనని. అప్పుడు దూతలను వాల్మీకి దగ్గరికి పంపి తన మాటను ఇలా చెప్పమన్నాడు. ''మహర్షి నమస్కారము. మీ రామాయణ కావ్యం రమ్యముగా ఉన్నది. నిజంగా జానకీదేవి కళంక రహిత అని భావిస్తే ఆమెను సభాముఖానికి తీసుకువచ్చి ఆవిషయం ఆమె నిరూపించుకోవాలి''.

- దీనికి వాల్మీకి ఇలా అన్నారు ''సీత రేపు సభా మండపానికి వచ్చి, తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటుంది. కాబట్టి ఆమెపై అభాండాలు వేసిన వారు కూడా సభకు రావొచ్చు''.
- మరుసటిరోజు సమా మండపంలో గంభీర స్వరంతో వాల్మీకి ఇలా అన్నారు. ''సభికులారా ఈమె (సీత). పరమసాధ్వి. దశరధుని కోడలు, శ్రీరాముని ఇల్లాలు. ఈమెను శ్రీరామచంద్రుడు లోకనిందకు భయపడి పరిత్యజించాడు. నేను చెప్పునది సత్యము. ఇందులో ఏమైనా అబద్ధం ఉంటే ఇన్ని వేల సంవత్సరాల నా తపస్సు నిర్వీర్యమై పోగలదు.
- అప్పుడు రాముడు లేచి మునీంద్ర మీ మాటలు సత్య భూషణములు. నా దేవేరి శీలంపై నాకు ఎటువంటి సందేహం లేదు. లోకులకు కూడా తెలియాలి కాబట్టి నేనట్లు నడుచుకోవాల్సి వచ్చింది అని అన్నాడు.

⌘ **సీత భూప్రవేశం**

- ఇది ఇలా ఉండగా సీతాదేవి ఇలా అంది. ''నేను రాముణ్ణి తప్ప ఏ ఇతరులను తలచని దానిని అయితే భూదేవి నా ప్రవేశానికి వీలుగా దారి ఇవ్వాలి'' అని ప్రార్ధించింది. సీతాదేవి ప్రార్ధన ముగించి ముగించగానే భూమి బద్దలయ్యింది. నాగరాజులు మోస్తున్న సింహాసనం ఒకటి బయటకు వచ్చింది. సీత దానిపై ఆసీనురాలు అవ్వగా ఆ సింహాసనం పాతాళంలోకి దిగిపోయింది. సభాసదులు దీనులై విలపిస్తూ రాముడి వంక చూడగా రాముడి దుఃఖానికి అంతే లేదు. అత్తగారైన భూమిని తన భార్యను ఇమ్మని గద్దిస్తాడు. జగత్ప్రళయం సృష్టిస్తాను అని రాముడంటాడు. అయితే బ్రహ్మ రాముని వారించి, నిన్ను సీత స్వర్గధామంలో తప్పక కలుసుకుంటుంది అని అంటాడు.

⌘ **లక్ష్మణుడి ధర్మసంకటం - యోగ సమాధి**

- ఒకనాడు ఒక ముని వచ్చి రాముని కలవాలని లక్ష్మణుడిని అడిగాడు. రామాజ్ఞతో లక్ష్మణుడు మునిని రాముని గదిలోకి ప్రవేశపెట్టాడు. రామా మనం మాట్లాడే విషయాలు పరులెవ్వరికీ తెలియరాదు. ఒకవేళ ఎవరైనా మధ్యలో ప్రవేశిస్తే వారికి మరణ దండన విధిస్తాను అంటేనే నీతో ముచ్చటిస్తాను అన్నాడు. అందుకు సరేనన్నాడు రాముడు. లక్ష్మణుడిని ద్వారానికి కాపలాగా పెట్టాడు.
- రామ నేను మునిని కాదు యమధర్మరాజుని. నువ్వు వచ్చినా కార్యం ముగిసింది. కాబట్టి బ్రహ్మ పుణ్యలోకాలకు పయనం కావాలి. యమధర్మరాజుతో రాముడు నవ్వుతూ ఇలా

అన్నాడు ''యమధర్మరాజా ముల్లోకాలను రక్షించడమే నా బాధ్యత, నా స్వస్థలానికి రావడానికి నేను సిద్ధమవుతున్నాను'' అన్నాడు.

- ఇంతలో దుర్వాసుడు వచ్చి వెంటనే రాముణ్ణి కలవాలన్నాడు. లక్ష్మణుడి ఎంత చెప్పినా వినలేదు. నన్ను అనుమతించకపోతే నీ దేశం, వంశం, అన్నదమ్ములు నాశనం కావాలని శపిస్తాను అని అన్నాడు. ఇంత నష్టం జరిగేకంటే తానొక్కడినే మరణించిన తప్పులేదు అని భావించి లక్ష్మణుడు గదిలోకి ప్రవేశించి రాముడికి దుర్వాసుని గురించి చెపుతాడు.
- రాముడు యమున్ని వడివడిగా పంపి దుర్వాసునికి ఎదురేగి స్వాగతించాడు. దుర్వాసుడు తనకు ఆకలిగా ఉన్నదని మృష్టాన్నం కావాలని కోరాడు. దుర్వాసుని కోరిక తీర్చిన రాముడు తాను యమునికి ఇచ్చిన మాటనుతలచి విచారించసాగాడు. ''అన్నా నీవు మాట తప్ప వద్దు. ఏ సంకోచమూ లేకుండా నాకు శిక్ష విధించి ధర్మాన్ని నిర్వర్తించు అని ధైర్యం చెప్పాడు.
- రాముడు నిలువెల్లా కుంగిపోతూ వశిష్ఠ, భరత, శత్రుఘ్నులను సమావేశపరచి జరిగినదంతా చెప్పాడు. అప్పుడు వశిష్ఠుడు రామా ఆడి తప్పరాదు. నీవు లక్ష్మణుడికి దేశ బహిష్కరణ విధించు అన్నాడు. వెంటనే రాముడు నిర్ణయం తీసుకున్నాడు. దీనితో సౌమిత్రి తన ఇంటివైపు కూడా చూడక సరాసరి సరయు నది ఒడ్డు వద్దకు వచ్చి ''యోగ సమాధి'' అయ్యాడు. ఇంద్రుడు తన విమానంలో అతన్ని అమరావతికి తీసుకుపోయాడు.
- ఇక రాముడు రాజ్యం త్యజించి, భరతుడికి పట్టాభిషేకం జరపాలనుకున్నాడు. దీనికి భరతుడు అంగీకరించక రాజ్యాన్ని రెండు భాగాలు చేసి లవకుశలకు ఇద్దాం అన్నాడు. దాంతో వశిష్టుడు రాముడ్ని ప్రజల అభీష్టం బట్టి నిర్ణయం తీసుకోమన్నాడు.
- ప్రజాభిప్రాయాన్ని బట్టి రాముడు కుశలవులకు పట్టాభిషేకం చేశాడు. తరువాత అందరూ దుఃఖిస్తుండగా (రాముడు రాజ్యాన్ని వదిలినందుకు) రాముడు ఆంజనేయుడ్ని పిలిచి ''నాయనా, నీవు మైందుడు, ద్వివిదుడు మీ ముగ్గురూ కలికాలం అంతమయ్యేదాకా దీర్ఘాయువులై ఉండండి'' అని ఆశీర్వదించి మిగిలిన వానర భల్లూకవీరుల నందరిని తనతో తీసుకువెళ్లడానికి అనుజ్ఞ ఇచ్చాడు.

⌘ **రామావతార పరిసమాప్తి**

- మరునాడు తెల్లవారింది. బ్రాహ్మణులు అగ్నిహోత్రాలు పట్టుకొని ముందుకు నడుస్తూ ఉండగా రాముడు మంత్రోచ్చారణ చేస్తూ వారి వెంబడి నడిచాడు. బ్రహ్మర్షులు, విప్రులు,

భరత, శత్రుఘ్నులు, వానరులు, జనగణలు, రాక్షసులు ఆ పురుషోత్తముని వెంట నడిచారు.

- శ్రీరాముడు అర్థ యోజన దూరం నడిచి పడమర దిక్కుగా ప్రవహిస్తున్న సరయూ నదీ చేరుకున్నాడు. అప్పటికే దేవతలతో, ముని బృందాలతో బ్రహ్మదేవుడు ఎదురుచూస్తున్నాడు ఆకాశం దివ్య విమానాలతో నిండిపోయింది. దేవతలు దుందుభులు మ్రోగించారు. రాముడు సరయు నదిలోకి పాదాన్ని పెట్టాడు. బ్రహ్మ సూచన మేరకు రాముడు వైష్ణవ రూపం స్వీకరించాడు. సోదరులు కూడా అలానే చేశారు.( అనగా విష్ణువు)
- అప్పుడు విష్ణువు బ్రహ్మతో ఇలా అన్నాడు ''నావెంట వచ్చిన వారంతా నా భక్తులు. సర్వం త్యజించి నన్ను అనుసరించిన వారు. వీరికి పుణ్యలోకాలు ప్రసాదించు అని ఆజ్ఞాపించాడు.
- రాముడ్ని అనుసరించిన వారు ''గోప్రైతారం'' అనే తీర్థంలో మునిగారు. వీరికి పూర్వ శరీరాలు పోయి, దివ్య శరీరాలు వచ్చాయి. అప్పుడు వారు తమకు కేటాయించిన విమానాల్లో పుణ్య లోకాలకు వెళ్లిపోయారు.

⌘ **రామాయణం ముఖ్య పాత్రలు**

| | | |
|---|---|---|
| 1. | అహల్య | - ఈమె గౌతమ మహర్షి భార్య. శాపం వల్ల రాయిగా మారింది. రాముని స్పర్శ వల్ల శాపవిమోచనం కలిగింది. |
| 2. | భరతుడు | - శ్రీరాముని సోదరుడు, కైకేయి దశరథుల కుమారుడు. |
| 3. | దశరథుడు | - కోసలరాజు మరియు శ్రీరాముని తండ్రి |
| 4. | దుషాణుడు | - అనగా పది తలలు కలిగినవాడు. లంకాధిపతి. అతడే రావణాసురుడు. |
| 5. | గరుడ | - పక్షి రాజు, విష్ణు వాహనం. |
| 6. | గౌతముడు | - ఇతడి ఒక మహర్షి. ఇంద్రుని నిర్వాకం వల్ల ఇతడు తన భార్య అహల్యను శపించాడు. |
| 7. | హనుమంతుడు | - వాయుపుత్రుడు, రామ భక్తుడు, చిరంజీవి సీతను అన్వేషించిన వాడు. సుగ్రీవుని మంత్రి. |
| 8. | ఇంద్రజిత్తు | - రావణుని కుమారుడు. తన అద్భుత మంత్ర శక్తులతో రాముని పై యుద్ధం చేశాడు. |

9. జాంబవంతుడు - సీతాన్వేషణకు నాయకత్వం వహించిన యోధుడు. మంత్రశక్తులు కలవాడు.
10. జనకుడు - మిథిలకు రాజు, సీతకు తండ్రి
11. జటాయువు - గ్రద్ద రాజు, వనవాసంలో కొంతకాలం సీతకు కాపలాగా ఉన్నాడు. రావణుని చేతిలో హతమయ్యాడు.
12. కైకేయి - దశరథుని యొక్క చిన్న రాణి. భరతుని తల్లి. రాముడ్ని అరణ్యవాసానికి పంపాలని కోరింది.
13. కౌసల్య - దశరథుడి పెద్ద రాణి. రాముని తల్లి.
14. కేవతుడు - పడవను నడిపే వాడు, సీతారామ లక్ష్మణులను తన పడవలో నదిని దాటించాడు. అంతేకాక రాముడి పాదాలు కడిగాడు
15. ఖరుడు - రావణ, సూర్పణకలకి సోదరుడు
16. కుంభకర్ణుడు - రావణుని సోదరుడు, అమిత బలశాలి, దీర్ఘకాలం నిద్ర, అధికమైన తిండి గలవాడు
17. కుశుడు - సీతారాముల పెద్ద కుమారుడు
18. లక్ష్మణుడు - సుమిత్ర, దశరథుల కుమారుడు, రాముని సోదరుడు
19. లవ - సీతారాముల చిన్న కుమారుడు, కుశుని సోదరుడు
20. మాండవి - భరతుని భార్య, జనకుని కుమార్తె
21. మంథర - కైకేయి పరిచారిక, భరతుని సింహాసనంకై రాముడ్ని అడవికి పంపేలా కైకేయిని ఒత్తిడి చేసింది
22. మారీచుడు - బంగారు లేడి లాగా మారి సీత అపహరణకు కారకుడైన వాడు
23. మేఘనాథుడు - రావణుడి కుమారుడు, తన బాణంతో లక్ష్మణుడ్ని మూర్ఛిల్లేలా చేశాడు
24. నలుడు - గొప్ప నిర్మాణ దక్షిత కలవాడు, శ్రీరాముని కొరకు రామేశ్వరం వద్ద వారధి నిర్మాణం చేపట్టి లంకను కలిపాడు
25. తాటకి - మారీచుని తల్లి, శ్రీరామునిచే వధింపబడింది
26. తులసీదాస్ - కవిపండితుడు, అవధి(హిందీ) భాషలో రామాయణాన్ని రచించాడు. దీన్ని తులసి రామాయణం అంటారు.

27. ఊర్మిళ - లక్ష్మణుడి భార్య, జనకుని కుమార్తె మరియు సీత సోదరి
28. వాలి - కిష్కింద రాజు, సుగ్రీవుడి సోదరుడు, రామునిచే సంహరింప బడ్డాడు
29. వాల్మీకి - మహర్షి, కవి, శ్రీరాముని చరిత్ర అయిన రామాయణంను సంస్కృత భాషలో రచించాడు. సీతను, అటుపిమ్మట ఆమె ఇద్దరి కుమారులకు తన ఆశ్రమంలో ఆశ్రయం ఇచ్చాడు
30. వానరులు - కోతి జాతికి చెందినవారు. హనుమంతుని, సుగ్రీవుల సైనికులు. ఇది గిరిజన జాతి.
31. వశిష్ట - ఇక్ష్వాకు వంశ కుల గురువు (అయోధ్య)
32. విభీషణుడు - రావణుని సోదరుడు, రామ రావణ సంగ్రామంలో రాముని చెంతచేరి, తరువాత లంకకు ప్రభువైనవాడు.
33. విష్ణువు - స్థితి దేవుడు, ఈయన యొక్క 7వ అవతారమే శ్రీరాముడు
34. విశ్వామిత్రుడు - రాముని గురువు, మహర్షి
35. శ్రీరాముడు - రామాయణ కథానాయకుడు, దశరథ పుత్రుడు, సీతానాథుడు, విష్ణువు అవతారము.
36. సంపాతి - జటాయువు (గ్రద్ద రాజు) సోదరుడు
37. శత్రుఘ్నుడు - రాముని కనిష్ఠ సోదరుడు
38. శబరి - రామ భక్తురాలు, రామలక్ష్మణులకు తినే ఫలాలను నైవేద్యంగా పెట్టింది
39. శతతానంద - మిధిల రాజ్య కుల గురువు.
40. శివుడు - శివుడు లయకారక దైవం. ఇతని పేరు పైన బిల్లునే రాముడు సీతా స్వయంవరంలో ఎక్కుపెట్టాడు
41. శ్రవణుడు - తల్లిదండ్రుల కుమారుడు, కడ కాలంలో తల్లిదండ్రులకు ఇతోధికంగా సేవ చేసినాడు
42. శృతి కీర్తి - శత్రుఘ్నుడు భార్య
43. శూర్పణక - రావణుని చెల్లెలు, ఈమె యొక్క ముక్కు, చెవులను కోసివేసాడు
44. సీత - జనకుని కూతురు, రాముని భార్య

45. సుగ్రీవుడు - వానరాధిపతకి, కిష్కింద రాజు

46. సుమంత - దశరథుని రథ చోదకుడు

47. సుమిత్ర - దశరథుని భార్య, లక్ష్మణ, శత్రుఘ్నులు తల్లి

48. సునయన - జనకుని భార్య మరియు సీతాదేవి తల్లి (పెంపోడు)

49. సుశేషుణుడు - వైద్యుడు, లక్ష్మణుని మూర్ఛ నుండి ఉపశమనానికి సంజీవిని పర్వత ఔషధాలను గురించి తెలియజేశాడు. **రామాయణంలో కనిపించిన (చెప్పబడిన) ప్రదేశాలు**

1. ఆడమ్స్ బ్రిడ్జి - దీన్నే రామసేతు అని కూడా అంటారు. దీన్ని నలుడి ఆధ్వర్యంలో వానరులు నిర్మించారు. రామేశ్వరం నుండి శ్రీలంక మధ్య (పంబన్ దీవి నుండి మన్నార్ జలసంధి మధ్య) వంద యోజనాల దూరం,48 కిలోమీటర్లు. ఇది క్రీస్తు శకం 1480లో కూలిపోయింది.

2. అంజనేరి - నాసికా త్రయంబకం సమీపంలోని పర్వత శిఖరం. ఇది హనుమంతుని జన్మ స్థానం అని పలువురి అభిప్రాయం

3. అంతర్వేది - వశిష్ఠ గోదావరి బంగాళాఖాతంలో కలిసే చోటు

4. అశోక వాటిక - రావణుడు సీతను లంక లో ఉంచిన వనమే అశోక వాటిక

5. అయోధ్య - ఇక్ష్వాకు రాజ్య రాజధాని

6. చిత్రకూటము - ఇది మధ్యప్రదేశ్‌లో ఉందియ సీతారామలక్ష్మణులు ఇక్కడ 11½ సంవత్సరములు వనవాసం ఉన్నారు. గొప్ప మహర్షులు అయినా దత్తాత్రేయ, సతీ అనసూయ, మార్కండేయ వాల్మీకులు ఇక్కడ తపస్సు చేశారు.

7. దండకారణ్యము - ఇది ప్రస్తుత బస్తర్ (చత్తీస్ ఘడ్) తాలూకాలో ఉంది. ఇక్కడ సీతారామలక్ష్మణులు కొంతకాలం నివసించారు. అనేక రాక్షసులను రాముడు సంహరించాడు.

8. డెహ్రాడూన్ (ద్రోణ నగరి) - ఇది ఉత్తరాఖండ్ లో ఉంది. రామ రావణ యుద్ధం ముగిశాక రామలక్ష్మణులు ఈ ప్రదేశానికి వచ్చారు.ద్రోణుని జ్ఞాపకార్ధం ఈ ప్రదేశాన్ని ద్రోణ నగరి అని పిలిచేవారు.

9. ధనుష్కోటి - ఇది తమిళనాడులోని రామేశ్వరం (పంబన్) సమీపంలో ఉంది.

10. జనక్ పూర్ - ఇది ప్రస్తుతం నేపాల్ లో ఉంది. ఒకప్పటి మనదేశ రాజ్య రాజధాని. ఇక్కడే సీతాదేవి భూమి నుండి జనకునికి లభించింది.

11. కుషావతి - ఇది కోసల రాజ్యం లో ఒక పట్టణం. శ్రీరాముదు రాజ్యాన్ని లవకుశల మధ్య పంచాడు. కుశుడ్ని దక్షిణభాగానికి రాజును చేసి, కుషావతి దగ్గర సింహాసనం అధిష్ఠించేలా చేశాడు.

12. మాదేపుర - ఇది మిథిల రాజ్యంలో ఒక పట్టణము. ఇక్కడి ప్రజలు మైథిలీ భాషను మాట్లాడుతారు.

13. మలయవతి కొండ - ఇవి తూర్పు కనుమల్లో ఉన్నాయి. సీతాన్వేషణలో, హనుమ ఇతర వానరులు ఈ కొండలను దాటారు. లంక నుండి కోసలకు బయలుదేరినప్పుడు మార్గం మధ్యలో సీతారాములు ఇక్కడ ఆగారు.

14. గంధమధన - సీతాన్వేషణకై లంకకు చేరుక్రమంలో హనుమ ఈ కొండపైన దిగాడు. ఇది రామేశ్వరం దాటిన తర్వాత వస్తుంది.

15. నాసిక్ - సీతారామలక్ష్మణులు ఇక్కడ కూడా వనవాసం ఉన్నారు. రాముని ఆజ్ఞతో ఇక్కడే లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులు కోసేసాడు.

16. ఔషధి పర్వతం - ఆంజనేయుడు ఔషధాలకై హిమమునుండి ఎత్తుకుని లంకకు తీసుకువచ్చిన పర్వతం.

17. పంపానది - ఇది ప్రస్తుతం కర్ణాటక (హంపి సమీపం)లో ఉంది. ఇక్కడే శబరి రామునికై వేచి పూజించి ఫలాలను పెట్టింది.

18. పంచసరాలు - ఇది దండకారణ్యంలోని ఒక సరస్సు. దీని నిర్మాత మంద రాముడు సందర్శించాడు నిర్మాత మాండలికర్ణి మహర్షి.

19. పంచవటి - సీతారామలక్ష్మణులు వనవాసంగా కొంతకాలం గడిపిన ప్రదేశం.

20. పుష్పాలవతి - ఇది వాయువ్య భారతంలో ఉంది. భరతునికి కుమారుడైన పుష్కరుడు దీన్ని నిర్మించాడు. ఇది ఒకప్పటి గాంధార రాజ్య రాజధాని.

21. రామేశ్వరం - సీతాన్వేషణకై సముద్రుడి ప్రార్ధించి ఇక్కడ రాముడు సేతువుని 'నలుడి'చే నిర్మింపజేశాడు. శివుడ్ని లింగ రూపంలో రాముడు ఇక్కడ పూజించాడు.

22. రామ్ టెక్ - ఇది మహారాష్ట్ర లో ఉంది. దీని సమీపంలో ఆగస్త్య మహాముని ఆశ్రమం ఉంది. ఇక్కడ రాముడు కొంతకాలం సేదతీరాడు

23. రావణ జలపాతం - ఇది ప్రస్తుతం శ్రీలంకలో ఉంది. రావణుడు సీతను అపహరించిన తరువాత కొంతకాలం ఆమెను ఇక్కడి గృహాల్లో దాచాడు.

24. సంజీవిపర్వతం - హిమాలయాల్లో (ద్రోణనగరి) ఉంది. లక్ష్మణుని మూర్ఛ తొలగించడానికై (ఇంద్రజిత్తు బాణం కారణంగా) జాంబవంతుడి సలహాపై 4 మూలికలు కనిపించక మొత్తం పర్వతాన్నే తీసుకుని వచ్చాడు.

25. సంకీశ - ఇది రామాయణ కాలంలో సంకాష్య నగరంగా పిలువబడింది. దీన్ని జనకుని సోదరుడైన కుషధ్వజుడు పాలించేవాడు.

26. శ్రావణ క్షేత్రము - ఇది ఉత్తరప్రదేశ్ లో ఉంది. ఇక్కడే దశరథుడు శ్రవణుడ్ని పొరపాటున బాణంతో చంపుతాడు.

27. వలుకేశ్వర్ - ఇది ముంబాయి సమీపంలో ఉంది. సీతాన్వేషణ చేసేటప్పుడు రామలక్ష్మణులు ఇక్కడ ఆగారు. రాముడు శివలింగాన్ని నిర్మించి ఇక్కడ పూజలు చేశారు.

28. ప్రయాగ(అలహాబాద్) - వనవాసంలో భాగంగా అయోధ్యను వదలిన తరువాత సీతారామలక్ష్మణులు మొదట కొంత సేపు ఇక్కడ ఆగారు

29. లేపాక్షి - ఇది ఆంధ్రప్రదేశ్ లో ఉంది. ఇక్కడే జటాయువు రావణుని సంహరించాడు.

30. కిష్కింధ - ఇది వాలి,సుగ్రీవుల రాజ్యం. ఇక్కడే రాముడు హనుమంతుణ్ణి, ఇతర వానరవీరులను కలిశాడు.

**ముఖ్యమైన రాజవంశాలు**

1. ఇక్ష్వాకు రాజ్యం - దశరథుడు, శ్రీరాముడు
2. అయోధ్య రాజ్యం - సగరుడు, అంశమంతుడు
3. బోయ రాజ్యం - గుహుడు
4. లంకా రాజ్యం - రావణుడు
5. మిథిలరాజ్యం - జనకుడు
6. అంగ రాజ్యం - రోమపాదుడు
7. కిష్కింద రాజ్యం - వాలి, సుగ్రీవుడు

**రామాయణం**

**(Objective Questions)**

1. ఈ క్రింది ఏ ప్రదేశాలలో రామాయణం నాటకంగా ప్రసిద్ధి పొందినది.
   1. కంబోడియా 2. వియత్నాం
   3. థాయిలాండ్ **4. బాలి**
2. వాల్మీకిని శ్రీరామ చరిత్ర అయినా రామాయణమును వ్రాయమని ప్రేరేపించినది ఎవరు?
   1. నారదుడు 2. ఇంద్రుడు
   **3. బ్రహ్మ** 4. విష్ణువు
3. బాలకాండములో మొత్తం ఎన్ని సర్గలున్నాయి ?
   1. 119 **2. 77**
   3. 68 4. 67
4. దశరధుని పుత్రకామేష్టి యాగాన్ని చేసిందెవరు?
   1. రోమపాదుడు 2. సగరుడు
   **3. ఋష్యశృంగుడు** 4. కుశధ్వజుడు
5. ఈ క్రింది వాటిలో తప్పుగా జతపడినది ఏది?
   1. బృహస్పతి – తారుడు 2. కుబేరుడు - గంధమాదనుడు
   **3. అశ్వినీ దేవతలు – శరభుడు** 4. వరుణుడు - సుశేషుణుడు

6. శ్రీ రాముడ్ని వనవాసంకు పంపించమని కైకేయికి చెప్పింది ఎవరు?

1. సుమిత్ర 2. భరతుడు

3. మండోధరి **4. మంథర**

7. వనవాసానికి సీతారాములను రథం పై తీసుకొని వెళ్ళింది ఎవరు?

1. లక్ష్మణుడు 2. భరతుడు

3. వశిష్ఠుడు **4. సుమంత్రుడు**

8. వనవాసానికి వెళ్లడానికి ముందు రాముడు తన ఆభరణములను ఎవరికిచ్చాడు?

1. దశరథుడు **2. సుమజ్ఞుడు**

3. భరతుడు 4. సుమంత్రుడు

9. వనవాస కాలంలో తొలుత సీతారాములు ఎవరి ఆశ్రమానికి చేరుకున్నారు?

1. అత్రి 2. అగస్త్య

**3. భరద్వాజ** 4. శరభంగ మహర్షి

10. శ్రీరాముడు ఏ నదీజలాలతో దశరధునికి తర్పణం వదిలాడు ?

**1. మందాకిని** 2. గంగా

3. యమున 4. తుంగభద్ర

11. అరణ్య కాండంలో మొత్తం ఎన్ని సర్గలున్నాయి ?

1. 68 2. 119

**3. 75** 4. 131

12. రాముడ్ని సుతాక్ష మహర్షి ఆశ్రమానికి వెళ్ళమని చెప్పింది ఎవరు?

1. విరాదుడు **2. శరభంగ మహర్షి**

3. మాండలికర్ణి మహర్షి 4. అగస్త్యుడు

13. సూర్పణఖ యొక్క ముక్కు, చెవులను లక్ష్మణుడు ఏ ప్రదేశంలో కోసివేశాడు?

1. కిష్కింద 2. లంక

3. చిత్రకూటం **4. పర్ణశాల**

14. శ్రీ రాముని ఆదేశంపై లక్ష్మణుడు పర్ణశాలను ఎక్కడ నిర్మించాడు?

1. ప్రయాగ 2. పంచవటి

3. చిత్రకూటం 4. దండకారణ్యం

15. బంగారు లేడిగా మారి సీత అపహరణలో రావణుడికి సహాయపడింది ఎవరు?

1. జటాయువు **2. మారీచుడు**

3. ఖరుడు 4. కబంధుడు

16. వాలి ఆగ్రహానికి గురైన సుగ్రీవుడు ఏ పర్వతం మీద నివసిస్తున్నాడు?

1. త్రికుటగిరి 2. సంజీవిని

3. ఓషధి పర్వతం **4. ఋష్యమూక గిరి**

17. వాలికి కాంచనమాలను ఎవరు వరంగా ఇచ్చారు?

1. కుబేరుడు **2. ఇంద్రుడు**

3. బ్రహ్మ 4. శివుడు

18. ఈ క్రింది వారిలో ఎవరు వాలి యొక్క కుమారుడు?

1. సుషేణుడు **2. అంగదుడు**

3. శతబలుడు 4. వినతుడు

19. ఈ క్రింది వారిలో ఎవరికి విపరీతమైన భౌగోళిక జ్ఞానం ఉంది?

1. హనుమంతుడు 2. వాలి

3. జాంబవంతుడు **4. సుగ్రీవుడు**

20. ఈ క్రింది వాటిలో సరైన జత ఏది?

1. అంగదుడు ఎ) పడమర

2. సుషేణుడు బి) ఉత్తరం

3. శత బిలుడు సి) దక్షిణం

**4. వినతుడు డి) తూర్పు**

21. రాముడు మరియు అతని లంకను గురించిన సమాచారాన్ని సుగ్రీవాదులకు తెలిపినది?

1. జటాయువు 2. మైనాకుడు

3. మేరు సావర్ణి పుత్రిక **4. సంపాతి**

22. నీడ ద్వారా హనుమను లాగిన రాక్షసి ఎవరు ?

1. లంకిణి 2. సురస

**3. సింహిక** 4. మైనాకిని

23. అశోకవనంలో సీత కు రక్షణగా నిలిచిన రాక్షసి రాక్షస కాంత ?

1. శింశుపా 2. మండోదరి
3. లంకిణి 4. త్రిజట

24. ఈ క్రింది వారిలో ఎవరు తన బాణంతో హనుమను బంధించాడు?
**1. ఇంద్రజిత్తు** 2. అక్షయ కుమారుడు
3. జంబూలి 4. మేఘనాథుడు

25. హనుమ మొదటగా తన నిప్పుతో ఉన్న తన తోకతో తొలుత ఎవరి ఇంటిని తగులబెట్టాడు?
1. ఇంద్రజిత్తు 2. రావణుడు
**3. ప్రహస్తుడు** 4. అక్షయ కుమారుడు

26. హనుమతో సీత ఎన్ని రోజుల్లో రాముణ్ణి చూడకుంటే మరణిస్తానని చెప్పింది?
1. పక్షము **2. మాసము**
3. రెండు మాసములు 4. మూడు మాసములు

27. విభీషణుడు నమ్మదగినవాడని రామునికి ఎవరు చెప్పారు ?
1. జాంబవంతుడు **2. హనుమంతుడు**
3. సుగ్రీవుడు 4. అంగదుడు

28. లంకకు చేరటానికై వంతెన నిర్మాణం చేసింది ?
**1. నలుడు** 2. విశ్వకర్మ
3. యముడు 4. విభీషణుడు

29. రాక్షస వీరుల్లో ధూమ్రాక్షుడు ఎవరి చేతిలో హతమయ్యాడు?
1. అంగదుడు 2. నలుడు
3. జాంబవంతుడు **4. హనుమంతుడు**

30. లక్ష్మణుడు ఏ నది ఒడ్డున యోగ సమాధి అయ్యాడు?
1. గోమతి 2. గంగా
3. మందాకిని **4. సరయూ**

÷÷÷÷÷